POSTAL REGD.NO.PRAKASAM/16/2021-2023
REGD.NO. 37926/83
ESTABLISHED : 1983
జూన్ 2023
వెల – ₹ 10.00

సాయిబాబా

ఆధ్యాత్మిక వైజ్ఞానిక మాసపత్రిక

సంపుటి: 41 సంచిక: 02

పూజ్యశ్రీ అలివేలు మంగమ్మ తల్లి ఆరాధనోత్సవము

(03-06-2023)

ఈ నెల పండుగలు

జూన్ 03 - పూజ్యశ్రీ అలివేలు మంగమ్మ రెండవ ఆరాధనా మహోత్సవము
జూన్ 04 - శ్రీ పాకలపాటి గురువుగారి జయంతి (తిథి ప్రకారము - జ్యేష్ఠ పౌర్ణమి)

"ఆధ్యాత్మిక పరిపూర్ణతయందు అభిలాష గలవారికి ఏ మార్గాన్నవలంభించాలా, ఏ మహాత్ముడు చెప్పింది, లేక ఏ మతం చెప్పింది నమ్మాలా అని సందేహాలు కలుగుతుంటాయి. 'ఏ మార్గమైనా సరిగా ఆచరిస్తే ఒకే స్థితికి దారితీస్తుంది' అన్న విషయం వివిధ మార్గాలలో, వివిధ మతాలలో కనిపించే మహాత్ముల చరిత్రలలో నిరూపితమైంది. ఐనా కొందరికి ఈ సందేహం తీరదు. దీనికితోడు అన్ని రంగాలలోనూ అవినీతి ప్రబలినట్లే ఈ రంగంలో కూడా సామర్థ్యంలేని వారనేకమంది ప్రజలను మోసగించి స్వప్రయోజనాలను సాధించుకోవడం చాలా విరివిగా జరుగుతోంది. ఇది చాలదన్నట్టు ఒక మహాత్ముని భక్తులు ఇతర మహాత్ములంతా దొంగలూ, వంచకులూ అని దుష్ప్రచారం చెయ్యడం చాలా విరివిగా జరుగుతోంది. ఇవన్నీ కలిసి సత్యాన్వేషకుడికి ఎన్నో చిక్కులు తెచ్చిపెడుతున్నాయి. ఈ పరిస్థితులలో కబీరు, రమణ మహర్షి, సాయిబాబా, రామకృష్ణ పరమహంస వంటి అనేక మహాత్ములు చెప్పిన ఒక్క సత్యం ఆశాజ్యోతిగా మెరుస్తుంది. 'అన్వేషకుడి ఆర్తి తీవ్రమైనపుడు అతనికి తగిన మార్గం చూపే మహాత్ముడు అతనికి లభిస్తారు' అని చెప్పారు. మహాత్ముల చరిత్రలలో ఇటువంటి నిదర్శనాలెన్నైనా చూడవచ్చు. నా అనుభవంలో మహాత్ముల చరిత్ర పఠన, వారి ఉపదేశాలను గూర్చిన చింతన, వారిని ధ్యానం చెయ్యడం చాలా ప్రయోజనకారిగా కనిపిస్తున్నాయి."

పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ

శ్రీ శిరిడీ సాయిబాబా చేసిన చమత్కారాలు ?

పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ

ఈనాడు మన రాష్ట్రంలోనే ఎందరో మహనీయులుగా పూజింపబడుతున్నారు. వీరిలో చాలామంది విభూతి, లాకెట్లు గడియారాలు మొ॥న వస్తువులు చిత్రమైన రీతిన "సృష్టించి" యిస్తున్నారు. వారిచుట్టూ ఎందరో ధనికులు, విద్యావంతులు, విజ్ఞాన శాస్త్రవేత్తలూ గూడ చేరుతున్నారు. వీరిలో విదేశీయులు గూడ వున్నారు. కొందరు మహనీయులు యింద్ర భవనాలలో జీవిస్తూ, ఖరీదైన విదేశీయ కార్లలో తిరుగుతూ వున్నారు. దేశంలో వీరిపట్ల అపారమైన భక్తికలవారూ కఠోరమైన విమర్శలు చేసే వారున్నారు. సామాన్యులకు ఈ ద్వందవైఖరిలో ఏది సరియైనది అన్న సందేహం ఎదురౌతోంది.

అయితే ఈ కథ ఈనాటిది కాదు. ఆధ్యాత్మికత మతము అన్నవి మానవనైజంలోనే విడదీయలేని అంతర్భాగాలని నేటి ఆంత్రోపాలజిష్టుల పరిశోధనలు నిరూపిస్తున్నాయి. ఏదో ఒక విధమైన మతాభినివేశము, ఆధ్యాత్మ విద్య ప్రపంచంలోని అన్ని జాతులవారిలోను అనాదిగా వుండడమే దీనికి గుర్తు. ఇందుకు మన యోగశాస్త్రం ఒక వివరణ నిచ్చింది. దాని ప్రకారం యిప్పుడు మనకు అద్భుతాలు, ప్రకృతికి అతీతమూ అయినవిగా కన్పించే ఈ 'మహిమలు' అట్టివి గానేరవని, ప్రకృతిలోని అంతర్భాగాలేనని ఆ శాస్త్రం చెబుతుంది. మనకిప్పుడు ప్రకృతిలో గోచరించే ప్రకృతి ధర్మాలు ఆ ప్రకృతియొక్క సంపూర్ణ తత్త్వం కాదని, అపారమైన ప్రకృతిలో పరిమిత పరిశీలనాశక్తి గల మన యింద్రియాలు, వాటివలన సామాన్యంగా మన మనస్సుకు గోచరించే అంశాలను మాత్రమే మనము చూస్తామని ఈ శాస్త్రం చెబుతుంది. ఏ కారణం చేతనయినా మన యింద్రియాల పరిశీలనా శక్తిగాని, మన మనస్సుయొక్క అవగాహనా శక్తినిగాని పెంచుకోగలిగితే అప్పుడు మాత్రమే మనకనుభవమయ్యే ప్రకృతి ధర్మాలెన్నో వుంటాయి. నిజానికి వాటికి అంతేలేదు. మన పరిశీలనా అవగాహనా శక్తుల పరిమితే ప్రకృతి ధర్మాల పరిమితిగా మనకనుభవమౌతుంది. అట్టి విశిష్టమైన స్థితిని పొందిన వారనుభవించే పనిచేయగల రీతులు; అట్టి స్థితిలేని సామాన్యులకు మహిమలుగానూ, ప్రకృతి కతీతమైనవిగానూ అనిపిస్తాయి - గానీ నిజానికి అవీ ప్రాకృతికమైనవేనని యోగశాస్త్రం చెబుతుంది. అలా చూస్తే ఆ శక్తులు కలవారిని ఆరాధించవలసిన అవసరమూ లేదు, విమర్శించవలసిన అవసరమూ లేదు.

కాని సర్వజీవులు తపించేది తృప్తి శాంతులకోసం. జీవితంలో ఎన్ని వున్నా వ్యక్తులను ఏదో ఒక వెలితి, అసంపూర్తి, అసంతృప్తి పీడిస్తూనే వుంటాయి. వాటినెలా జయించాలన్నదే మానవ జీవిత సమస్య. అట్టి అసంతృప్తిని శాశ్వతంగా జయించడం చేతకాక తాత్కాలికంగానైనా మరవాలన్న ప్రయత్నమే, మానవులు సిరిసంపదలు కూడబెట్టడము, భోగవిలాసాలలో మునిగి తేల జూడటము, అందుకోసమే ఎంతటి అధర్మానికైనా వెనుదీయకపోవడమే సమాజంలో అసమానత, అవినీతి పెచ్చుపెరగడానికి కారణం. ఇట్టి అసంతృప్తి అందరికీ సామాన్యమేనని గుర్తించలేని

ఆధ్యాత్మిక వైజ్ఞానిక మాసపత్రిక

సాయిబాబా

OFFICIAL ORGAN OF SRI MANGA BHARADWAJA TRUST

సంపుటి:41 జూన్-2023 సంచిక:02

పరమపూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారిచే స్థాపించబడిన ఏకైక పత్రిక, మన 'సాయిబాబా'

విషయ సూచిక

01.	శ్రీ శిరిడీ సాయిబాబా చేసిన చమత్కారాలు?	పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ	03
02.	పరిప్రశ్న	పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ	06
03.	సర్వసమన్వయ కర్త	పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ	07
04.	సజీవ సన్నిధి!!	శ్రీమతి అడిదం వేదవతి	15
05.	మాతృదేవి స్మృతులు	శ్రీమతి వెల్లంకి విజయలక్ష్మి	18
06.	వార్తాలాపము	శ్రీమతి అడిదం వేదవతి	19
07.	మరికొందరు భక్తులు	పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ	21
08.	శ్రీశ్రీశ్రీ మాతా ఆనందమయి జీవితం మరియు బోధలు	శ్రీమతి శ్రీదేవి	22
09.	ఆశాజ్యోతి	శ్రీ వాసుదేవరావు	24
10.	ద్వారకామాయి అనుభవమండపము	శ్రీమతి జయప్రద	25
11.	ఆచార్యుని అద్భుత లీలలు	శ్రీ రామకృష్ణశర్మ	27

చిరునామా

Sri Manga Bharadwaja Trust,
Bhakta Nivas, 12-1-170/46P, Hanuman Nagar,
Jaipuri Colony, Nagole, Hyderabad - 500068
Phone No. +91 - 74160 41550

www.saibharadwaja.org
www.saimasterforums.org

చీఫ్ ఎడిటర్: డా॥ ఆర్.ఎస్. శశిధర్, పిహెచ్. డి

చందా వివరములు

విడి ప్రతి	:	రూ. 10-00
సంవత్సర చందా	:	రూ. 100-00

సాయిబాబా పత్రికలో వెలువడే వ్యాసాలకు, అభిప్రాయాలకు ఆయా రచయితలే బాధ్యులు.

వ్యక్తులు తమలోనే అట్టికొరత, లోపము వున్నాయన్న ఆత్మన్యూనతా భావాన్ని (ఇన్‌ఫీరియారిటీ కాంప్లెక్స్)కు గురియౌతారు. దీనిని విస్మరించగలగడానికే అట్టివారు సాటివారి మన్ననలను, గౌరవాన్ని పొందాలని జూస్తారు. ఫాషన్‌లన్నీ ఈ బలహీనతలపైననే ఆధారపడ్డాయి. తమ అందము, వేషభాషలు, ధనము, కళానైపుణ్యాలు నేటి సమాజంలో ఎక్కువభాగం యిట్టి ప్రయత్నాలుగానే పరిణమిస్తున్నాయి. కనుక యిట్టి తృప్తి, శాంతి పొందే మార్గాన్ని సర్వులకూ తెలుపుతే తప్ప అటు సమాజంలో ధర్మము, యిటు వ్యక్తులకు శాంతి కలిగే అవకాశమేలేదు. ఆ మార్గమే ఆధ్యాత్మికత. దీనికంటే ముందు సర్వులకూ తిండి, గుడ్డ లభించడమే ముఖ్యమనడం సరిగాదు. సరియైన తృప్తికి మార్గం తెలియక ప్రతివారూ పై తెల్పిన రీతులలో ధనము పదవి మొ॥న వాటిని అక్రమముగానైనా మూటగట్టుకోవాలని తపిస్తున్నంతసేపూ అందరికీ తిండి, గుడ్డ దొరికే అవకాశమే వుండజాలదు. ఈ సమస్యను పరిష్కరించగల ఆధ్యాత్మికతను ఎవరికివారు సాధించుకుంటూ, సాటివారికి తెల్పుకుంటూ పోవడమే సర్వమానవులకూ ఉత్తమమైన కర్తవ్యము.

ఇలా అంటే ప్రతి ఒక్కరికి సమాజం పట్ల, తన కుటుంబం పట్ల, తన పట్ల నిర్వర్తించవలసిన కర్తవ్యాలను విడిచిపెట్టి ముక్కుమూసుకోవాలని తలచరాదు. అతడు వీటిని నిర్వర్తించడంలో ఒక ముఖ్యమైన భాగంగా ఆధ్యాత్మవిద్యను గూడ గుర్తించాలని మాత్రమే. ఇది ఎలాగో దొంగదారిగా పరీక్ష పాసై ఉద్యోగం సంపాదించుకోడానికి బదులుగా - నిజాయితీతో విద్యను సామర్థ్యాన్ని పెంచుకుని తన బాధ్యత చక్కగా నిర్వర్తించడం ద్వారా భుక్తి సంపాదించుకోవడం లాంటిది. సాటివారు గూడ అలానే చేసేలా ప్రబోధించి ప్రోత్సహించడం లాంటిది.

ఆధ్యాత్మిక జీవితంలో గూడ ఈ రెండు వైఖరులు చరిత్ర పొడుగునా కనిపిస్తాయి. సామాన్య మానవుడు తన జీవితంలోగల అసంతృప్తి, అశాంతుల వలన ఆత్మ న్యూనతాభావానికి ('ఇన్‌ఫీరియారిటీ కాంప్లెక్స్') గురియౌతాడు. కారణం అట్టికొరత తనకు మాత్రమే వున్నదని తలుస్తాడు. దానిని విస్మరించడానికి సాటివారి మన్ననలు పొందడమే మార్గమని తలుస్తాడు. కొందరు సిరిసంపదలను, అధికారాన్ని చేజిక్కించుకొని దానిని సాధించుకోజూస్తారు. కొద్దిమంది ప్రత్యేకమైన సాధనద్వారా తమ యింద్రియ మనస్సుల శక్తులను పెంచుకొని, సాటివారు మహిమలని భ్రమించే పనులు జేసి వారి మన్నన పొందాలని జూస్తారు. అంతపట్టుదల లేనివారు హస్తలాఘవం వంటి కుయుక్తులతో నకిలీ మహిమలు చూపి ధనము, కీర్తి సంపాదించుకోజూస్తారు. కాని బహు కొద్దిమంది మాత్రం అశాంతి – అసంతృప్తి సర్వమానవులకు సహజమేనని తెలిసి వాటిని నివారించుకొనే మార్గాన్ని తాము సాధించుకొని, సాటివారు గూడ సాధించుకొనేలా ప్రోత్సహించ జూస్తారు. వీరు అసలైన మహనీయులు. మొదటి రెండు రకాలవారిని యోగభ్రష్టులు అంటారు. అంటే ఆధ్యాత్మికతయొక్క అసలు లక్ష్యాన్ని సాధించే బదులు ప్రధానమైన మానవజీవిత సమస్యకు ఏ విధంగానూ దోహదం చేయని లక్ష్యాలకోసం ప్రాకులాడుతారు. అటువంటి ఆత్మన్యూనతా భావంతోనే, దాని నుండి జనించిన వ్యామోహాలలో మ్రగ్గుతుండే సామాన్యుల దృష్టి అసలు జీవిత లక్ష్యం వైపునుండి మరల వాటిపైకే ప్రసరిస్తుంది. అసలైన ఆధ్యాత్మికతను సాధించుకొంటున్న వారిలోగూడ 'మహిమ' మేల్కొనవచ్చు, కాని వారికది అప్రధానమవుతుంది. వీరు యోగభ్రష్టులవలె సాటివారి దృష్టిని మహిమల వైపుకే మరల నివ్వక అసలైన ఆధ్యాత్మికతకు అవసరమైన సర్వమానవ సౌభ్రాతృత్వాన్ని, సర్వజీవులూ పరమాత్మ రూపాలేనన్న ఎఱుకను కల్గించడానికీ, క్లిష్టమైన పరిస్థితులలో భక్తులనాదుకొని వారి కృతజ్ఞతతో నిజమైన ఆధ్యాత్మిక లక్ష్యానికి వారిని బంధిస్తారు.

ప్రపంచంలోని ఆధ్యాత్మిక సాంప్రదాయాలన్నీ యోగభ్రష్టుల విధానాలను నిరసించి మహాత్ముల విధానాలను కీర్తించాయి. కారణం యోగభ్రష్టుల విధానాలలో ఆధ్యాత్మ విద్యగూడ సమాజానికి శ్రేయస్కరంగాని రీతిన కీర్తికాంక్ష మొ॥న మానవ బలహీనతలకు లోబరుస్తుంది. మహాత్ముల వలన సమాజంలో ధర్మము పటిష్టమవుతే యోగభ్రష్టులవలన కీర్తి-ధనకాంక్షలు బలపడి ఆధ్యాత్మవిద్యకే కళంకం తెస్తాయి. తమ వ్యక్తిగతమైన మహిమలను కీర్తి-ఆధిక్యతల కోసం వాడుకొన్నవారే పురాణాలలోని రాక్షసులు. బ్రహ్మర్షి కాకముందు విశ్వామిత్రుడు చేసిన మహిమలను ఋషులు నింద్యమైనవిగానే వర్ణించారు. అట్టి మహిమలనే క్షుద్ర విద్యలుగా యోగ, మంత్ర శాస్త్రాలు అభివర్ణించాయి.

మిగతా 29వ పేజీలో

పరిప్రశ్న

పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ

ప్రశ్న :-స్త్రీలు మెన్సెస్ వలన ఆటంకం కలిగినపుడు ఎన్ని రోజులు పూజ చేయగూడదు. ఎన్నిరోజులు 'శ్రీ గురుచరిత్ర' సాయిబాబా జీవితచరిత్ర' పారాయణ చేయగూడదో చెప్పగోర్తాము.

- లక్ష్మీకాంతమ్మ, రంగుతోట, ఒంగోలు

జవాబు :-ఆధ్యాత్మికతంతా మానవుడు ఆంతరంగికంగా పరిశుద్ధుడవడమే. శుద్ధి లేక శౌచము రెండు విధాలు; బాహ్యము, అంతరంగికమున్నూ. మానసిక, శారీరక శౌచము బాహ్యము. ఆధ్యాత్మిక శౌచము ఆంతరంగికము. ధ్యానం ఆధ్యాత్మశుచికి మార్గం. ఆరోగ్యమైన ఆహారం, న్యాయార్జిత జీవనము, దానము, ఇంద్రియ మనోనిగ్రహములు, వివేకంతో రాగ ద్వేష మమకారాలను తొలగించుకొనడమూ శారీరక మానసిక శుద్ధికి కారణాలు.

మీ ప్రశ్న శారీరక శుచికి సంబంధించినది. మనస్సుకూ శరీరానికి సామాన్యులందరితోనూ అవినాభావ సంబంధముంటుంది. పూర్తిగా మనస్సును వశంచేసుకున్న వారిని మాత్రమే దేహసంబంధమైన అశుచి ఏమీచేయలేదు. భోజనానికి ముందు చేతులు కడుక్కొనడంలాగా నిద్రలేవగనే మలమూత్ర విసర్జనలు; పళ్ళు తోమడం లాగా బహిష్టు విషయంలో గూడ శుచిని పాటించడం కొంతైనా అవసరం.

ఈ విషయంలో ఎంతవరకు వాటిని పాటించితీరాలన్నది మన మారాధించే మూర్తినిబట్టి వుంటుంది. ఉదాహరణకు శ్రీ రాఘవేంద్ర స్వామి, శ్రీ పాదవల్లభులు, శ్రీ నృసింహ సరస్వతిస్వామి బహు ఆచారవంతులు, కనుక వారి విషయంలో మనం బహిష్టు సమయంలో పూజ, పారాయణ చేయక మరుస్నానమయ్యాకనే వారిని

పూజించాలి. వారి చరిత్రలు పారాయణ చెయ్యాలి. కారణం అప్పుడు మనకు వారిసన్నిధి లభిస్తుంది. శ్రీ సాయి చాలా మితంగా మాత్రమే శుచిని పాటించారు కనుక వారి చరిత్ర బహిష్టు సమయంలో ఆపి స్నానమయ్యాక చేయవచ్చు. కాని నేటి పరిస్థితుల ననుసరించి బహిష్టు సమయాలలో కూడ స్త్రీలు యింటిపనులు చేసుకొనక తప్పడం లేదు. కనుక సాయిచరిత్ర పారాయణ బహిష్టయిన మొదటి రోజు మాత్రం మాని మిగిలిన రోజులు చేయవచ్చు. పూజగూడ అంతే. ఆ సమయంలో స్త్రీలు విడిగావుండే అవకాశముంటే ఆ నాల్గు రోజులు ఆపి మిగిలిన మూడు వారాలలోనే పారాయణ చేసుకొనడం ఉత్తమం. శ్రీ సాయి లీలలను, నామాన్ని మాత్రం సదా స్మరించవచ్చు. ●

(ఏప్రిల్ 2014 సాయిబాబా మాసపత్రిక నుండి)

సర్వసమన్వయ కర్త

పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ

అది వైదిక సాంప్రదాయక నిలయమా? లేక ఆధునిక నాగరిక నివాసమా? .....అవును, అది రెండింటినీ సమన్వయం చేసిన మహాసౌధం! అక్కడ వైదిక సాంప్రదాయాన్ని చక్కగా పాటిస్తారు. అలాగే ఆధునిక నాగరికతను గూడ సక్రమంగా అవలంబిస్తారు. ఈ రెండింటి యొక్క సమన్వయలోపం అక్కడ మచ్చుకు కూడా కనిపించదు. చూస్తుంటే, ఆలోచిస్తుంటే అవి రెండూ వేరుగావనే భావనేగాక ఆచరణగూడ అక్కడ కనిపిస్తుంది. ఎవరి ధర్మాన్ని వారు చక్కగా పాటించడము, భార్యాభర్తల మధ్య సరియైన అవగాహన, పిల్లల పెంపకంలో వుండవలసిన శ్రద్ధ, జాగ్రత్తలు; బంధువులపట్ల బాధ్యత, సాటివారితో సమైక్యత; సమాజం పట్ల నైతిక బాధ్యత – ఇవన్నీ ఒకే పుష్పగుచ్ఛంలో పువ్వులు ఇమిడినట్లు ఆ కుటుంబంలో ఇమిడి వుంటాయి. అక్కడ ఎంతటి క్లిష్ట సమస్య ఎదురైనా అవలీలగా ఎదుర్కొనే ధైర్యము – ఎంతటి అశాంతి పరిస్థితి ఏర్పడినా శాంతిగా మలచుకోగల వివేకమూ – కనిపిస్తాయి. అక్కడ తోచనితనము వుండదు. నిత్యనూతనత్వమే జీవిస్తుంది. అశాంతి, దైన్యము, అభద్రతాభావము, నిరాశ, నిస్పృహ, జీవితంపట్ల విరక్తి, ఇతరులపట్ల అసూయ, ద్వేషాదులు – ఇంకా ఎన్నెన్నో కలబోసిన నేటి సమాజంలో ఇవేవీ చెంతకు రానీయని కుటుంబము ఒకటి వున్నదా? అనే సందేహము ఎవరికైనా కలుగవచ్చు. అందుకు సమాధానమే మన శ్రీ ఎక్కిరాల అనంతాచార్యులవారి కుటుంబం.

పూజ్యశ్రీ మాస్టరుగారి కృతజ్ఞతారాధన మహోత్సవ 25వ వార్షికోత్సవ సందర్భంగా శ్రీమాన్ ఎక్కిరాల అనంతాచార్యులవారి మహోన్నత జీవన విధానం గూర్చి, ఆ కుటుంబం గూర్చి క్లుప్తంగా చెప్పుకుందాము. శ్రీమాన్ అనంతాచార్యులవారు సాంప్రదాయక వైష్ణవ కుటుంబంలో 1897లో జన్మించారు. ఆనాడు అంటే 100 సం॥ల క్రితం కుల వ్యవస్థ ఎంత బలీయంగా వుండేదో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదనుకుంటాను. ఆచార వ్యవహారాలు ఎక్కువగా వున్న బ్రాహ్మణ కుటుంబంలో జన్మించినప్పటికీ ఆయన వీటికి మూలమైన, వీటికి అతీతమైన సత్యంపట్ల సరియైన అవగాహన కలిగివున్నారనే చెప్పాలి. కారణం ఆయన ఆచరణ దానికి అనుగుణంగానూ, భిన్నంగానూ గూడా వుండడమే. ఆయన ఆంగ్లంలో ఉన్నత విద్యనభ్యసించి ఎమ్.ఎ. (ఇంగ్లీషు) లో పట్టా సంపాదించారు. అంతేగాక వైదిక గురువు వద్ద వేదవిద్యను గూడ అభ్యసించి అందులో నిష్ణాతులయ్యారు. ఆంగ్లవిద్యలో ఏ విధంగానైతే ఆంగ్లములో ప్రత్యేక శిక్షణ పొందారో, అలాగే వేదవిద్యలో గూడ ఋగ్వేదంలో ప్రత్యేక శిక్షణ పొందారు.

ఆంగ్లవిద్య నభ్యసించినప్పటికీ తెల్లవారు నిర్వహించే ఉద్యోగాల జోలికి వెళ్ళక ఋగ్వేదంలోని ఆయుర్వేద వైద్యవిధానం పట్ల ఆకర్షితులై స్వంతంగా ఆయుర్వేద వైద్యంలో ఎంతోమంది వ్యాధిగ్రస్థులను స్వస్థులను చేశారు. ఆయుర్వేద వైద్యుడిగా గొప్పఖ్యాతిని గడించారు. ఒక ప్రక్క యోగంలో ఉన్నత స్థితినందుకోవడంలోనూ, మరొక ప్రక్క మల్లయుద్ధంలో ప్రావీణ్యత సంపాదించడంలోనూ ఆయనకుగల సామర్థ్యం అపారం.

తర్వాత తన ఇష్టాయిష్టాలకు తావివ్వక గురువు చెప్పిన కన్యనే వివాహం చేసుకోవడం ఆయనలోని మరొక

ప్రత్యేకత. అనుకూలవతియైన శ్రీమతి బుచ్చిలక్ష్మిగారితో వారి వైవాహికజీవితం చక్కగా సాగింది. కానీ కొంతకాలం తర్వాత ఆమె అనారోగ్యం పాలైనారు. తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నప్పటికీ, ఇంట్లో అత్తలు, ఆడపడుచులు, తోటికోడండ్రు మొ॥న కుటుంబ సభ్యులతో వచ్చే సమస్యలు ఎన్ని వున్నప్పటికీ ఆమె ఎంతో ఓర్పుతో అన్నింటినీ భరించేవారు. కుటుంబసభ్యులపట్ల, భర్తపట్ల, పిల్లలపట్ల ఆమె తన బాధ్యతను ఎన్నడూ విస్మరించలేదు. ఆమె ఆరోగ్యం పూర్తిగా క్షీణించిపోతున్న సమయంలోగూడ ఆమె కృంగిపోలేదు. ఒకప్రక్క అయిదుగురు పిల్లలు, అందునా మరీ పసిపిల్లలు ఇద్దరు – మరొకప్రక్క తనను ప్రాణంగా చూసుకునే భర్త – తాను ధైర్యం కోల్పోతే వారి పరిస్థితి, మానసిక స్థితి ఎలా వుంటుందోనన్న ఆలోచనే ఆమె ధైర్యంతో వుండడానికి కారణం కావచ్చు. ఏది ఏమైనా ఆమె చివరిదశలో ఇక పడుకుంటే చనిపోతావని వైద్యులు స్పష్టం చేసినప్పటికీ ధైర్యంతో 40 రోజులపాటు కూర్చునే వుండి, ఇక కూర్చోలేక, అదే నిబ్బరంతో తాను పడుకోవడానికి – అంటే తాను మరణించడానికి సిద్ధమేనని చెప్పిన ధీశాలి, ధైర్యశాలి ఆమె. ఇంతకంటే ఆమె యొక్క గొప్పతనాన్ని చాటి చెప్పే విషయం మరొకటి ఏముంటుంది? ఎవరి జీవితంలోనైనా ఇటువంటి పరిస్థితి వస్తే అంత ధైర్యంగా ఎదుర్కోగల సాహసం ఎవరికైనా ఉంటుందా?

ఇక శ్రీమాన్ అనంతాచార్యులవారి విషయానికి వస్తే...... భార్యా వియోగంతో ఒంటరి జీవితం, తల్లిలేని పిల్లలు – అందునా తెలిసీ తెలియని వయస్సులో అమ్మ కావాలని ఏడ్చే పసిపిల్లవాడు, ఒక చోట వైద్యశాల పెట్టుకోవటం గాక ఊరూరా తిరిగే వైద్యవృత్తి – ఇదీ అప్పటి ఆయన పరిస్థితి. జీవితంలో సంభవించిన ఇంతటి కష్టపరిస్థితులు అనే ఎదురుగాడ్పులకు చెదరక నిలబడ్డ మేరుపర్వతంవలె ధీరగంభీరుడు ఆయన. అంతటి పరిస్థితిలోనూ ఎవరికీ తన బిడ్డలను దత్తతనివ్వక తల్లిని మరిపించేలా వారి ఆలనాపాలనా చూస్తూ, వైద్యవృత్తిని నిరాటంకంగా నిర్వర్తించారు.

ఇంతవరకూ చేయడం అక్కడక్కడా మరికొంతమంది చేసివుండవచ్చు. సాధారణంగా ఎవరూ చేయలేని ఆయనలోని అంశం మరొకటి వున్నది. అది వ్యక్తి స్వాతంత్ర్యం. మన జీవితంలోని ప్రతి విషయమూ మన ఇష్టాయిష్టాల ప్రకారమే ఎలాగైతే జరగాలని అనుకుంటామో అలా ప్రతివారికీ వుంటుంది గనుక ఆయన ఆ అంశానికి ప్రాధాన్యత నిచ్చారు. కారణం వ్యక్తి వికాసం దానిమీదనే ఆధారపడుతుంది గనుక. ఇతరులు పట్టుకుంటేగానీ నడువని వాడికి సంపూర్ణమైన నడక ఎలా వస్తుంది? కనుక నడక వలెనే నడత గూడ స్వతంత్రంగానే వుండాలన్నది వారి ఉద్దేశ్యం. అందుకని తన పిల్లలపట్ల గానీ, తనతో సంబంధమున్న ఎవరిపట్లనైనాసరే, తన భావాలను రుద్దేవారు గాదు. వారి తిండి, బట్టలు, చదువు విషయాలలోనే గాక వివాహ విషయంలో గూడ సంపూర్ణ స్వాతంత్ర్యాన్ని ఆయన యిచ్చారు. చివరకు పూజ్యశ్రీ మాస్టరుగారు తాము వివాహం చేసుకోనని స్పష్టంగా చెప్పినప్పుడు “నువ్వు వివాహం చేసుకోవడం నా అభిమతం. నువ్వు ఎవరిని చేసుకున్నా సరే– చివరకు నిమ్నజాతిపిల్లను చేసుకున్నా సరే నాకిష్టమేనని” – అంత స్పష్టంగా చెప్పిన నేటి నాగరికతావాది ఆయన.

ఇతరులపై ఆధారపడకుండా, తనకు తానుగా బ్రతకడం నేర్చుకుని, చేతనైతే సాధ్యమైనంత ఇతరులకు సహాయం చేయాలనే దృఢవిశ్వాసం కలవారాయన. అందుకనే తాము ఎంత పెద్దవారైనప్పటికీ ఎవరి ఇంట్లోనూ వుండక, తామే స్వయంగా వండుకుంటూ ఒంటరిగానే (తాము చేసుకోగలిగినంతవరకూ) జీవించారు.

అంతేగాక నాటి సమాజవ్యవస్థకు వ్యతిరేకంగా కనిపించే కులమత భేదాలను ఏమాత్రం పట్టించుకోక తన యింట ఒక చాకలి పిల్లవానికి ఆశ్రయమిచ్చి, అతనికి వైద్యవృత్తిని నేర్పి, అతనికి జీవనోపాధి కల్పించి వివాహం చేశారు.

యువకులకు మల్లవిద్యను ఉచితంగా నేర్పడంతో పాటు వారికి వలసిన పౌష్టికాహారం గూడ ఉచితంగా పెట్టిన ఉదారుడాయన.

అంతేగాక ‘భరద్వాజ గురుకులం’ అనే పేరుతో ఒక గురుకులాన్ని స్థాపించి, అందులో కులమతభేద వివక్షత లేకుండా తమ పిల్లలతో పాటుగా నిరక్షరాస్యులైన పల్లెటూరి ప్రజల పిల్లలకు గూడ విద్యను బోధించిన ఘనుడు.

ఆరోజుల్లోనే నెలకు 30,40వేలు ఆర్జించినప్పటికీ తనకు, తన పిల్లలకంటూ ఏమీ దాచిపెట్టుకోలేదు. “ముందు సంగతేమిటి? కనీసం ఒక స్వంత ఇల్లైనా కట్టుకోరాదా?” అని హితులు, సన్నిహితులు చెప్పినప్పుడు, “మన సంపాదన సాధ్యమైనంతగా ఇతరులకు ఉపయోగపడాలి. పిల్లలు వాళ్ళ

కాళ్ళమీద వాళ్ళు నిలబడి వాళ్ళ పోషణ బాధ్యత వారే చూసుకోవాలి. రెక్కలు యివ్వడం వరకే మన పని" అని సమాధానం చెప్పిన మానవతావాది ఆయన.

స్వచ్ఛమైన, అంటే సరియైన, అంటే కలుషితంగాని వైదికత ఏమి చెబుతుందో, అలాగే ఎటువంటి కాలుష్యము లేని ఆధునికత అదే బోధిస్తుంది.

ఆధునికత ఏం చెబుతుంది. కులమత విభేదాలు లేని సమాజం కావాలంటుంది.

వేదకాలంలో గూడా అదే పాటించబడింది. అక్కడ కులమత వ్యవస్థలేదు. గుణాన్ని బట్టి, ప్రవృత్తిని బట్టి మాత్రమే వారికి ఆ పేరు విధించబడింది. ఉదాహరణకు వ్యాపారం చేసేవానికి వర్తకుడు అనీ, గుడ్డలు ఉతికేవానిని చాకలి అనీ, యజ్ఞయాగాదులు చేసేవారిని బ్రాహ్మణులు అనీ పిలిచేవారు. చివరకు రాజు గూడా ఒకే కులానికి చెందినవాడుగా వుండేవాడు గాదు. చాకలికి పుట్టినవాడైనా రాజ్యాన్ని పాలించవచ్చు. వేశ్య కుమారుడైనా బ్రహ్మవిద్యను నేర్చుకోవచ్చు. వారు చేసే పనులను బట్టి ఏదో ఒక గుర్తు వుండాలి గనుక ఆ పేర్లతో పిలిచేవారు. నేటి కాలంలో గూడా వైద్యవృత్తిని చేపట్టిన వారిని వైద్యులని, న్యాయ వృత్తిని చేపట్టిన వారిని న్యాయవాదులనీ, కూలీపని చేసేవారిని కూలీలని పిలుస్తూనే వున్నాము గదా!

కాకపోతే మధ్యలో ఈ వ్యవస్థ పోయి ఏ వృత్తిని చేపట్టినవారిని ఆ కులంగా భావించి వారి సంతతిని ఆ కులంవారిగా భావించడం జరగడం వల్ల ఇప్పుడున్న కులవ్యవస్థ ఏర్పడింది.

అయితే నేటి సమాజంలో కులభేదాలు నిర్మూలించబడ్డాయా? అన్ని కులాలూ ఒకటేనని చెబుతూనే ఒక కులం వారికి ప్రతిదానిలోనూ రాయితీలు యివ్వడంలోనూ, తమ వారికే అన్నింటిలోనూ ప్రత్యేకత చూపించడంలోనూ, ప్రేమించినవారు భిన్న కులస్తులైతే వారి వివాహానికి ఒప్పుకోకపోడం లోనూ కులవ్యవస్థ ఎంతగా బలపడివున్నదో గమనించవచ్చు.

నాగరికత సాధించామనే నేటి సమాజంలోనే కులవ్యవస్థ ఇంత బలీయంగా వుంటే అప్పుడాయన అలాంటి భావాన్ని వ్యక్తం చేయడంలో ఆయన ఎంత ఆధునిక భావాలు గలవారో అర్థమౌతుంది. అంతేగాక ఆయన బ్రాహ్మణులైనప్పటికీ ఏ కులానికి చెందినవారి గృహంలోనైనా నిస్సంకోచంగా భోజనం చేసేవారు.

ఇంతకూ అట్టి కుటుంబం వల్ల ప్రయోజనమేమిటి? దీనికి సమాధానం ఎంతైనా చెప్పవచ్చు.

శ్రీమాన్ అనంతాచార్యులవారివల్ల లోకానికి ఎంతో శ్రేయస్సు చేకూరింది. శ్రీమాన్ అనంతాచార్యులవారు వేదవిజ్ఞానాన్ని లోకానికి అందించారు. ఆయనకు నలుగురు కుమారులు. వారందరూ ఆధునిక ఉన్నత విద్యలను అభ్యసించి విశ్వవిద్యాలయాలనుంచి పట్టభద్రులైనవారే.

శ్రీమాన్ అనంతాచార్యులవారి పెద్దకుమారుడైన శ్రీమాన్ ఎక్కిరాల కృష్ణమాచార్యులవారు W.T.T. అను సంస్థను స్థాపించి, ప్రజలను ఆధ్యాత్మిక మార్గంలో నడిపించారు. ఎన్నో వేలమందికి ఆయన గురువులై కులపతిగా పేరుపొందారు.

రెండవవారైన శ్రీమాన్ వేదవ్యాసగారు 'యుస్కెఫే' అను సంస్థను స్థాపించి ప్రజలను ఆధ్యాత్మిక మార్గంలో నడిపించారు.

మూడవవారైన శ్రీమాన్ బోధాయనగారు ప్రఖ్యాత ఆయుర్వేద వైద్యులై ఎంతోమందికి ఉత్తమమైన వైద్యసేవనందించారు.

ఇక నాలుగవ కుమారులు మన పూజ్యశ్రీ భరద్వాజ మాస్టరుగారు. ఆయన శ్రీ శిరిడీసాయి కల్చరల్ మిషన్‌ను స్థాపించి ఎంతోమందిని ఆధ్యాత్మిక, వైజ్ఞానిక పథంలో నడిపించారు.

నేడు సాయిబాబా భక్తులుగా ఇన్ని కోట్లమంది ఆంధ్రులు, ఇతర రాష్ట్రాలవారు, దేశస్థులు రూపొందడానికి మూలకారణం ఆయనేననడంలో సందేహం లేదు.

ఇంతకంటే ఏ కుటుంబం వల్లనైనా జరుగవలసిన శ్రేయస్సు ఏమున్నది? పూజ్యశ్రీ మాస్టరుగారు అనంతాచార్యులవారిలోని సద్గుణా లన్నింటినీ పుణికి పుచ్చుకున్నారు. పూజ్యశ్రీ మాస్టరుగారి గురించి కొద్దోగొప్పో పరిచయం వున్నవారందరికీ ఆయన మాతృవియోగము, అన్వేషణ, బాబా ఆయనకు ప్రసాదించిన అనుభవము, తర్వాత ఆయన చేసిన బాబా ప్రచారమూ తెలుసు. కానీ అంతకు మించి ఆయన గురించి చాలామందికి ఏమీ పెద్దగా తెలియదు. అందుకని ఆయన గురించి ఈ సందర్భముగా కొంచెం తెలుసుకుందాము. ఇంతకూ ఆయన చేసినదేమిటి?

మొదటగా ఆయన సృష్టితత్వాన్ని గూర్చి అన్ని కోణాలనుంచీ అన్వేషణతో యోచించి, వివేకంతో మథించి తెలుసుకున్నారు.

అంతేగాక అన్ని కుల, మత, వర్ణ వ్యవస్థల గూర్చి, వివిధ

రకాల సమాజాల పరిస్థితులను గూర్చి, వివిధ వ్యవస్థల గూర్చి, వివిధ జాతుల మనుగడ గూర్చి, విశ్వంలోని ప్రతి అంశము గూర్చి, భగవంతుని గూర్చి, వివిధ మతాలలోని మహాత్ముల గూర్చి, వారు చెప్పిన సిద్ధాంతాల గూర్చి- వీటన్నింటినీ ఉపయోగించుకునే మానవజాతి గూర్చి క్షుణ్ణంగా తెలుసుకున్నారు. వాటిని ఏవిధంగా ఉపయోగించుకుంటే మానవుడికి తాను కోరుకునే సుఖశాంతులు లభిస్తాయో తెలియజేయడమే ఆయన తమ ధర్మంగా తలచారు, అదే బోధించారు.

అయితే ఆయన 'సాయిబాబాను గూర్చి మాత్రమే ఎందుకు ప్రచారం చేశారు?' అన్న ప్రశ్న కొందరికి కలుగవచ్చు. ప్రపంచంలోని అన్ని విషయాల గూర్చి క్షుణ్ణంగా అవగాహన చేసుకున్న ఆయన శ్రీ సాయిబాబా ప్రచారాన్ని ముఖ్యసాధనగా ఎన్నుకున్నారంటేనే అందులో విశిష్టత తప్పక వున్నదని మనం అర్థం చేసుకోవచ్చు. కానీ అంతమాత్రంతో ఆయన ఆగలేదు. సైన్సు, విద్య, వైద్యం మొదలైన అనేక అంశాల గూర్చి వారు చెప్పేవారు. వ్యాసాలలో కూడా వ్రాసేవారు. సర్వతోముఖమైన మానవ అభివృద్ధే ఆయన ఆశించిన లక్ష్యం. దానికి ఆధ్యాత్మికత కీలకం. అట్టి ఆధ్యాత్మికతకు పరాకాష్ట శ్రీ సాయి. అందుకే శ్రీ సాయి తత్వాన్ని మూ స్వీకరించారు మాస్టరుగారు.

"శ్రీ సాయిబాబా నేటి ప్రపంచము ఎదుర్కొంటున్న సమస్యలన్నింటికీ పరిష్కారమార్గంగా అవతరించారు" అని ఆయనే స్పష్టంగా చెప్పారు.

"నేటి ప్రజలు అమాయకంగా నకిలీ గురువులను ఆశ్రయిస్తున్నారు. వారికి అసలైన ఆధ్యాత్మికత అంటే ఏమిటో, నిజమైన ఆధ్యాత్మికవేత్తలు ఎలా వుంటారో తెలియదు. కనుక అసలైన ఆధ్యాత్మిక వేత్తలు, మహాత్ములు, అవధూతలు, భక్తులు, సన్యాసులు ఎలా వుంటారో తెలిస్తే, వారు అటువంటివారి జోలికి వెళ్ళరు, మోసపోరు. ఉదాహరణకు ఏదైనా ఒక వస్తువుగానీ, పండుగానీ, పువ్వుగానీ మరేదైనాగానీ ఎలా వుంటుందో తెలిస్తే దానిని గుర్తుపట్టగలరు. అది కాని దానిని కాదనగలరు. అందుకని 'నిజమైన ఆధ్యాత్మికత' ను తెలియజేయడమే నా పని" అని నిశ్చయంగా చెప్పేవారాయన.

ఎందరో నకిలీ గురువులు తమను తాము ఎంతో గొప్పవారమని, తమవద్దనున్న ఆధ్యాత్మికత మరెవ్వరి దగ్గరా లేదని, తాము ముక్తిని సహితం కరతలామలకంగా ప్రసాదించగలమనీ చెప్పుకుంటున్నారు. నిజమైన గురువులు తాము గురువులమని గానీ, ఇతరులు శిష్యులనిగానీ తలచరు. శిష్యులే వారి అనుభవాలను బట్టి వారిని గురువులుగాను, అవతార పురుషులుగానూ తలుస్తారు.

అందుకని ఆయన ఏది నిజమైన ఆధ్యాత్మికతో, ఏదికాదో తెలియజెప్పడానికి ప్రయత్నించారు.

పూజ్యశ్రీ మాస్టరుగారి బోధనలో మరొక ప్రత్యేకత గూడ వున్నది. అది మానవులలోని సంస్కారాలను సరియైన విధంగా సంస్కరించుకోవాలని చెప్పడం. "ఆధ్యాత్మికత అంటే భగవంతుని పేరిట దానధర్మాలు, మందిర, ఆశ్రమ నిర్మాణాలూ, జపధ్యాన పారాయణలు చేయడమేనని అనుకుంటారు. భగవంతుని పేరిట ఉత్సవాలు ఎంతో వైభవంగా జరుపుకుంటారు. కానీ ఇతరుల వలెనే వారు గూడ అసూయాద్వేషాలతో అశాంతికి గురి అవుతూ వుంటారు. సుఖదుఃఖాలకు ఇతరులవలెనే స్పందిస్తుంటారు. మరి ఆధ్యాత్మికత వల్ల, భగవంతుని ఆశ్రయించడం వల్ల ప్రయోజనమేమున్నది? లౌకికంగా కోరికలు తీరడం తప్ప! అందుకనే ఆధ్యాత్మికత అంటే నాస్తికులకు అవహేళన కలుగుతున్నది" అనేవారాయన.

నేటి సమాజంలో లౌకిక వ్యవస్థలో ఎన్ని కోణాలలోనైతే అస్తవ్యస్తత వున్నదో అలాగే ఆధ్యాత్మికతలోనూ అస్తవ్యస్తత వున్నదని తలచి దానిని అన్ని కోణాలనుంచి సరిచేయడానికి ప్రయత్నించారు. పూజగాని, పారాయణగాని, జపధ్యానాదులుగానీ, దానధర్మాలుగానీ, సమాజసేవగానీ, ఎలా చేస్తే ఎలాంటి ఫలితాలు వస్తాయో, వాటిని సరియైన విధంగా ఎలా చేసుకోవాలో తెలియజెప్పారు.

ఆయన శ్రీ సాయిబాబాను తమ గురువుగా తలచినప్పటికీ, ఏ ఒక్క సాధననే చేయాలని ఎవరికీ చెప్పలేదు. ఎవరికి తగిన బోధననూ, సాధననూ వారికి తెలియజేశారు. 'శిష్యుని పరిపాకాన్ననుసరించి వారివారికి తగిన బోధ చేయగలవాడే సద్గురువు' అన్న వాక్యం ఆయన విషయంలో అక్షరసత్యం. పూజ్యశ్రీ మాస్టరుగారి దృష్టిలో ఎవ్వరూ ఎక్కువగారు, ఎవ్వరూ తక్కువాగారు. కులమతాల పట్లగాని, పేద ధనికులని గాని, బంధువులు, బయటివారనిగానీ, చిన్నపెద్ద అనిగానీ పక్షపాతం లేదు. తనకంటే ఎంతో చిన్నవారయినా ఒక మంచి సలహా యిచ్చినప్పుడు ఆయన స్వీకరించేవారు. తాము గురువుననిగాని, తనకు ఎవరూ ఏమీ చెప్పనవసరం లేదనిగాని, తనకు అన్నీ తెలుసు గనుక

తాను ఎవరిమాటా విననవసరం లేదనిగాని ఆయనెన్నడూ భావించలేదు.

చదువు విషయంలో గాని, ఉపాధి విషయంలోగాని, వివాహ విషయంలో గాని తనను అడిగినవారికి సలహాగా మాత్రమే తమ ఉద్దేశాలను చెప్పేవారు. అలా చేస్తే వచ్చే ఉపయోగాల గురించి చెప్పేవారు. వాళ్ళు తమ మాట పాటించకపోయినప్పటికీ ఆయన ఏమీ అనుకునేవారు గాదు.

'సరియైన బోధను అందించడం వరకే గురువు బాధ్యత. తర్వాత ఆ బోధను అందుకున్నవారు ఎలా తయారవుతారన్నది వారి వారి సంస్కారాన్ని బట్టి వుంటుంది' అన్నది ఆర్షవాక్యము, ఆధునిక సత్యము. తాము ఎన్నో సంవత్సరాలు లౌకిక విషయాల గూర్చి, ఆధ్యాత్మిక విషయాల గూర్చి శిక్షణ నిచ్చినప్పటికీ, తర్వాత ఆ శిక్షణను పొందినవారు సరియైన ప్రవర్తన లేనివారుగాను, ఆయనకు వ్యతిరేకులుగానూ తయారయినప్పటికీ, ఆయన ఏ మాత్రం పట్టించుకునేవారు గాదు.

పూజ్యశ్రీ మాస్టరుగారు చక్కటి కుటుంబవ్యవస్థను సమర్థించారు. కుటుంబంలో అందరూ సమన్వయంతో కలిసిమెలసివుండాలని ఆయన ఆకాంక్షించారు. సమన్వయంతో కలిసివుండే కుటుంబ వ్యవస్థే సరియైన సామాజిక వ్యవస్థకు పునాది అని ఆయన చెప్పేవారు. అందుకనే తమవద్ద వుండడానికి వచ్చిన ఎవరినైనాసరే కులమత విచక్షణ లేకుండా ఆదరించి తమ యింట్లో వుంచుకున్నారు.

నేటి సమాజంలోలాగా కొందరు పిల్లలు తల్లి, తండ్రి తప్ప మరెవరూ లేనివారుగా వుండడాన్ని కోరుకునే వ్యవస్థ ఆయనకు సుతరామూ ఇష్టం లేదు. మరెవరి పలకరింపు కూడా లేని ఒంటరి బ్రతుకుల వ్యవస్థను ఆయన ఇష్టపడేవారుగాదు. కనుక కనీసం ఒకచోట వున్న సాయి భక్తులైనా అందరూ కలిసి ఉమ్మడి కుటుంబంగా వుండాలని ఆయన ఆకాంక్షించారు. అందుకు సరియైన మార్గం ధర్మబోధ మాత్రమే అని ఆయన విశ్వసించారు.

"ప్రాచీన సమాజ వ్యవస్థ ధర్మమనే పునాది మీద నిర్మింపబడింది. కనుక దానిలో శాంతియుతమైన జీవనం కొనసాగేది. నేటి వైజ్ఞానిక ప్రపంచంలో ధర్మబోధ, దానికి మూలమైన ఆధ్యాత్మికత లేకపోవడంవల్ల అశాంతి నెలకొనివున్నది" అనేవారాయన.

అందుకని నాటి వైదిక విజ్ఞానాన్నీ, ఆధునిక విజ్ఞానాన్ని సమన్వయ పరచుకోవడమెలాగో తెలియజెప్పారు. ధర్మము, ఆధ్యాత్మికత లేని విజ్ఞానం ఎలా వినాశకారి అవుతుందో సప్రమాణంగా వివరించారు.

"నాటి వైదిక విజ్ఞానాన్నీ, నేటి ఆధునిక విజ్ఞానాన్నీ మేళవించుకుని వాటిలోని మెలకువలను గ్రహించి, వాటిని తగురీతిన ఉపయోగించుకోవాలి. దేనిని నిరసించనవసరం లేదు. ఎప్పుడూ గతంలోని లొసుగులను తొలగించుకుంటూ, వాటిలోని మంచిని తీసుకుంటూ, కాలానుగుణ్యంగా కొత్తవాటిని కనిపెట్టుకుంటూ, లొసుగులు రాకుండా చూసుకుంటూ వెళ్ళడమే సమాజ శ్రేయస్సుకు సరియైన మార్గము.

ఉదాహరణకు పూర్వం స్త్రీలు బయటకు వెళ్ళి చదువుకోవడమనేది లేదు. అంతమాత్రాన వారికి ఏమీ తెలియదనుకోవడం పొరపాటు. వాళ్ళకు ఇప్పటి స్త్రీలకంటె ఎక్కువగానే కుటుంబ నిర్వహణ, వైద్యవిధానము, విజ్ఞానము – అన్నీ తెలుసు. వాటిని ఎలా వినియోగించుకోవాలో గూడ తెలుసు. చదువుకోవడమంటే విద్యాలయాలకు వెళ్ళి పాఠాలు నేర్చుకోవడం మాత్రమే గాదని, అలా వెళ్ళవలసిన అవసరం లేకుండానే విద్యను కరతలామలకం చేసుకోవచ్చనీ నాటి స్త్రీలను చూస్తే తెలుస్తుంది.

నేడు స్త్రీలు పురుషులతో సమానంగా విద్యనభ్యసిస్తున్నారు. దేశాలనూ పరిపాలిస్తున్నారు. కానీ వారికి తమకున్న విజ్ఞానాన్ని ఎలా ఉపయోగించుకోవాలో తెలియడం లేదు. కేవలం ధన సంపాదన, సుఖాపేక్షలను ప్రధాన లక్ష్యంగా భావించడం వల్ల ఎంతో శ్రమపడి డబ్బు సంపాదిస్తున్నారు. అన్ని సౌకర్యాలనూ సమకూర్చుకుంటున్నారు. చదువుకున్నది కేవలం డబ్బు సంపాదించడానికే అన్నట్లున్నది నేటి స్త్రీల పరిస్థితి. కానీ 'సత్రం భోజనం – మఠం నిద్ర' అన్నట్లు వుంటున్నది నేడు సమాజంలో పట్టణాలలోనూ, నగరాలలోనూ వుండేవారి పరిస్థితి. కనుక ఇల్లు అంటే వస్తువులు పెట్టుకునేది మాత్రమే గాదు, కలిసివుండే మనుషులు కలది. కనుక అది లుప్తమైనప్పుడు నేటి విజ్ఞానం వల్ల ప్రయోజనమేమిటి? కనుక చదువుకున్న స్త్రీలు తమ పిల్లలతో పాటు పదిమంది పిల్లలను సక్రమంగా పెరిగేలా శ్రద్ధ తీసుకోవడము, వారికి చిన్నప్పటినుంచే ధర్మబోధ చేయడము ఎంతో ముఖ్యమైనది. ఇప్పటి వనరుల సహాయంతో, తమ విజ్ఞాన సహాయంతో

కుటుంబానికీ, సమాజానికీ ఇంకా ఇంకా ఎలా శ్రేయస్సు చేకూర్చాలో ఆలోచించాలి. ఇంటికి, సమాజానికి స్త్రీలు వెన్నెముక లాంటివారు. ధర్మం మూలస్తంభం లాంటిది. కనుక స్త్రీలు ధర్మప్రవర్తన కలిగివుండి ధర్మప్రబోధం చేయగలిగితే సమాజానికి అంతకంటే శ్రేయస్కరమైనది మరొకటి వుండబోదు" అని ఆయన చెప్పేవారు.

అయితే 'ఈ సమాజంలో పురుషుని పాత్ర ఏమీ లేదా?' అన్నదానికి సమాధానంగా ఆయనిలా చెప్పారు – "కుటుంబంలో ఎవరూ ఎక్కువాగాదు. తక్కువాగాదు. ఎవరి స్థానం వారిది. రాజ్యంలో రాజు గొప్పా? మంత్రిగొప్పా? లేక సైనికుడు గొప్పా? అంటే అందరూ ఒకటేనని సమాధానం చెప్పక తప్పదు. ఎంత తెలివిగల రాజైనా మంత్రి సరైనవాడు గాకపోతే రాజ్యాంగం సరిగా వుండదు. రక్షకుడైన సైనికుడు లేకపోతే రాజ్యం నిలవదు. అలాగే ప్రజలే లేకపోతే రాజ్యమేముంటుంది? అందుకని ఎవరి స్థానం వారిది. కుటుంబంలో రాజు స్థానం పురుషుడిదైతే మంత్రి స్థానం స్త్రీది. కనుక స్త్రీని సరియైన మంత్రిగా తీర్చిదిద్దివలసిన బాధ్యత పురుషుని పైన ఉన్నది. అందుకు రాజు సరియైన వాడుగా వుండాలి. రాజే సరియైనవాడు గాకపోతే రాజ్యాన్ని, తనకు సహాయకులనూ సరియైన మార్గాన ఎలా నడిపించగలడు? కనుక పురుషుడు ధర్మ ప్రవర్తనను అలవరచుకొని భార్యను సంస్కారవంతురాలిగా తీర్చిదిద్దుకుని (అంటే ఈనాడు చదువుకున్న, ఉద్యోగం చేసే స్త్రీలు భార్యగా రావాలని కోరుకుంటున్నట్లు) ఆమె సలహాలను స్వీకరిస్తూ కుటుంబ నిర్వహణ చేయాలి. స్త్రీని తెలివితక్కువదానిని గాను, తక్కువగానూ చూడడం చాలా హేయం."

ప్రకృతిని వినియోగించుకోవడం విషయానికి వస్తే వైదిక మార్గానికీ, ఆధునిక మార్గానికీ – రెండింటిలో కొట్టవచ్చినట్లు భేదం కనిపిస్తుంది. నేటి విజ్ఞాన ప్రపంచం ఏమాత్రం విచక్షణ లేకుండా ప్రకృతిని పిండుకోవడం జరుగుతున్నది. ఇదే వేదవిజ్ఞాన శాస్త్రం చెప్పినదానిని బట్టీ చూస్తే ప్రకృతిని సక్రమంగా మాత్రమే – అంటే తనకు, ఇతరులకు, ప్రకృతికీ ఏమాత్రం నష్టం వాటిల్లకుండా ఉపయోగించుకోవడం కనిపిస్తుంది.

ఉదాహరణకు ఒక మొక్కను ఔషధానికి గాని, ఆహారానికి గానీ, మరే ఇతర ప్రయోజనాలకు గానీ ఉపయోగించుకోవాలనుకున్నప్పుడు దాని మనుగడకు, దాని జాతి మనుగడకు, ప్రకృతికి, సమాజానికి ఎటువంటి నష్టం రాని విధంగా ఉపయోగించుకోవడమే జరిగేది. ఇప్పుడు అలా ఏ మాత్రం జరగడం లేదన్నది ఎవరు ఏమాత్రం ఆలోచించినా తెలిసే నగ్న సత్యం. అందుకని మనం చేసే ప్రతిచర్య యొక్క పర్యవసానం అనుభవిస్తున్నప్పుడు గానీ దానివలన కలిగే నష్టం గూర్చి తెలియడం లేదు.

అంతేగాక వేదపురుషులు ఏది చెప్పినా దాని వెనుక మౌలికమైన సత్యం ఇమిడి వుంటుంది. వైదికత దేనినైనా – అంటే మానవుల దగ్గరనుంచి ప్రకృతిలోని ప్రతిదానినీ – కృతజ్ఞతాభావంతో ఆరాధించే మనస్తత్వాన్ని రంగరించి నూరిపోస్తుంది. కారణం వారు అనంతవిశ్వంలోని ప్రతిదీ ఒకదాని మీద ఒకటి ఆధారపడి వుంటుందన్న సత్యాన్ని గ్రహించారు గనుక. అటువంటప్పుడు విశ్వంలో ఏది సక్రమంగా పని చేయకపోయినా అన్నింటి మనుగడా దెబ్బతింటుంది. అందుకని మన మనుగడకు అవసరమైన ప్రకృతిలోని ప్రతిదానికీ కృతజ్ఞత తెలుపకుండా వుండడం ఎలా సాధ్యం?

కానీ ఇప్పుడు ఆ కృతజ్ఞతా భావం లోపించడం ఎక్కువగా కనిపిస్తున్నది. స్వార్థపరమైన సమాజానికి కృతజ్ఞత ఎలా వుంటుంది? ఆరాధనా భావం ఎలా సాధ్యపడుతుంది? అందుకనే సమాజంలో ప్రతివిషయంలోనూ అస్తవ్యస్తత చోటు చేసుకుంటున్నది. అదే నేటి సమాజ దుస్థితి. ఈ అశాంతి స్థితి.

అందుకనే వేదకాలంలో వారు మానసిక ఆరోగ్యానికి గూడ ప్రాధాన్యత నిచ్చారు. ముందు మనస్సు జబ్బుపడకుండా వుంటే శారీరక, సామాజిక పరిస్థితులు ఎలావున్నా మానసిక శాంతి కలిగివుంటారని వారు గ్రహించారు. అందుకని మానసిక ఆరోగ్యానికి గూడ వారు సమపీట వేశారు. మానసిక, శారీరక ఆరోగ్యాలు రెండూ రెండు కాళ్ళవంటివని వారు భావించారు. అప్పుడు వ్యక్తి సరైన రీతిలో జీవనం సాగించగలడని తెలిపారు.

అందుకని ప్రకృతిలోని వనరులన్నింటినీ సక్రమంగా వినియోగించుకునే మార్గాలను వారు తెలిపారు. అందుకు అనేక శాస్త్రాలను రూపొందించారు.

అంతేగాక మానసిక ఆరోగ్యానికి కావలసి అనేక మార్గాలను వారు రూపొందించారు. అదే ఆధ్యాత్మికత, ధర్మం. ఆధ్యాత్మికత, ధర్మము వేరుగావు. ఆధ్యాత్మికతలో ధర్మం ఇమిడి ఉంది. ధర్మం లేని ఆధ్యాత్మికత లేదు. లౌకికత సక్రమంగా వుండడానికి ఎన్ని మార్గాలున్నాయో,

అలాగే ఆధ్యాత్మికతలో కూడా అనేక సాధనా మార్గాలను వారు ఏర్పరిచారు. కారణం సరైన ఆధ్యాత్మికత ద్వారా మానసిక శాంతి, శారీరిక ఆరోగ్యము, ప్రకృతిలోని ప్రతిదానిని సక్రమంగా వినియోగించుకునే ధర్మము యిమిడివున్నాయని వారు గుర్తించారు. కనుక మానసిక శాంతి, ప్రకృతిపట్ల సమన్వయం - ఈ రెండూ మానవ మనుగడకు ముఖ్యమైన అంశాలని వారు గుర్తించారు. ఇందులో మనం గమనించవలసిన విషయమొకటి వున్నది. పూజ్యశ్రీ మాస్టరుగారు నేటి విజ్ఞానశాస్త్రాన్ని కాదనలేదు. తప్పనీ అనలేదు. కారణం ఈ శాస్త్రాలన్నీ నాటి వైదిక విజ్ఞానంలో వున్నాయి గనుక. ఇంకా చెప్పాలంటే వైజ్ఞానికంగా గూడ నేటి శాస్త్రజ్ఞులు ఊహించలేని వైజ్ఞానిక సత్యాలను వేదశాస్త్రజ్ఞులు దర్శించారు, తెలియజేశారు గూడ. అందుకని నేటి విజ్ఞానం ఓనమాల దశలోనే వున్నదని, ఇంకా తెలుసుకోవలసినది ఎంతైనా వున్నదని పూజ్యశ్రీ మాస్టరుగారు నిర్భయంగా చెప్పేవారు.

కులమత భేదాలను ఆయన నిరసించారు. వర్ణాంతర కులాంతర వివాహాలను ఆయన సమర్థించారు. వివాహమంటే ఇద్దరు వ్యక్తులు కలిసివుండడం కాదని, రెండు మనసులు కలవడమనీ, కనుక మనసులు కలిసిన ఎవరైనా కులమత భేదాలు పట్టించుకోకుండా వివాహం చేసుకోవచ్చనీ ఆయన తెలిపారు.

“పెద్దలు ఇరువురి జాతకాలు, మంచి చెడులు, కుటుంబ పరిస్థితులు అన్నీ ఆలోచించి చేస్తారు. గనుక మరొక విధంగా వివాహం చేసుకోవటం వల్ల వారి జీవితాలు అస్తవ్యస్తమవుతాయి కదా” అన్నదానికి సమాధానంగా ఆయన “పెద్దవాళ్ళు నిర్ణయించిన వారి వైవాహిక జీవితాలు సజావుగా సాగుతున్నాయా?” అని నిలదీసి ప్రశ్నించారు.

“అలా చేస్తే కులవ్యవస్థ మంట గలుస్తుంది గదా!” అన్నదానికి ఆయన “ఇప్పుడు ఎవరు కులధర్మాన్ని అనుసరిస్తున్నారు? బ్రాహ్మణులు బ్రహ్మజ్ఞానం కోసంగానీ, సమాజ శ్రేయస్సుకోసంకాని వారి విధులను సక్రమంగా నిర్వర్తిస్తున్నారా? ఇతర కులాలవారి వృత్తులను వీరెందుకు చేస్తున్నారు? వేదవిద్యనభ్యసించడం గానీ, కనీసం సంధ్యావందనం చేయడంగానీ విధిగా చేస్తున్నారా? అటువంటప్పుడు అన్ని కులాలు ఒకటే అయినట్లే గదా! మరి వివాహవిషయంలో ఈ భేదమెందుకు పాటించాలి?” అని ఎదురు ప్రశ్నించారు.

కులమతభేదాలు లేని వైదిక సాంప్రదాయంలోని విశిష్టతను తెలియజేసి కులమతభేదాలు వద్దనుకుంటూనే, కులమతభేదాలతో కొట్టుకు చస్తున్న నాగరిక సమాజాన్ని అన్ని కోణాలనుంచి సరిచేయడానికి ప్రయత్నించడమే ఆయన తమ ధ్యేయంగా పెట్టుకున్నారు. అందుకు ఎన్ని అవరోధాలు వచ్చినా, ఎంతమంది వ్యతిరేకించినా ఆయన పట్టించుకోలేదు. “నా సిద్ధాంతాలను ఇష్టపడేవారూ, ఆచరించేవారు ఒక్కరున్నా ఫర్వాలేదు. నేను నమ్మిన సిద్ధాంతాన్ని పట్టుకుని నా కర్తవ్యాన్ని నిర్వర్తించడమే నా లక్ష్యం” అని పూజ్యశ్రీ మాస్టర్ గారనేవారు

“ఎవరికైనా తమ బలహీనతలను తొలగించుకోమని చెప్పడం ఇష్టముండదు. తగవులాడుకోవద్దు అంటే కోపం వస్తుంది. వాళ్ల బలహీనతలను పట్టించుకోకుండా చెప్పే ఆధ్యాత్మికత వాళ్ళకు నచ్చుతుంది. కానీ బలహీనతలను పోగొట్టుకోకుండా ఆధ్యాత్మికత ఎలా సాధ్యం? ఏ తిత్తికాతిత్తే అన్నట్లు బలహీనతలన్నీ అలాగే వుంచుకొని భక్తులమనీ, ఆధ్యాత్మిక వేత్తలమని భావించడం ఆధ్యాత్మికతను భ్రష్టుపట్టించినట్లే అవుతుంది. అందుకని అన్ని విషయాలలోనూ నిజమైన, మూలమైన, నిర్దుష్టమైన, నిష్కల్మషమైన దానిని తెలుసుకుని ఆచరించడమే ఆధ్యాత్మికత” అని ఆయన చెప్పేవారు.

“నేటి మానవుడు మలమల మాడిపోతున్నప్పటికీ తమకేమీ పట్టనట్లు వుండడము, కనీసం ప్రమాదాలు జరిగినప్పుడు కూడా తప్పించుకోవడము, స్వార్థం కోసం ఎటువంటి కిరాతకానికైనా ఒడిగట్టడము, సామాజిక, వైజ్ఞానిక, అభివృద్ధికి సంకేతాలా?” అని ఆయన నిలదీసి ప్రశ్నించారు. తాము ఎటువంటి పరిస్థితిలో వున్నప్పటికీ, నేటిమనిషి ఎటువంటి వాడయినప్పటికీ తనకు చేతనయినంత సహాయం చేయడానికెన్నడూ వెనుకాడలేదు. ఇందుకు ఉదాహరణలు ఆయన జీవితంలో కోకొల్లలు.

“నిజానికి నేటి విద్య, వైద్యము, వ్యాపారము. పరిపాలన మొదలైనవన్నీ ఇటు ఆధునికములు కావు, అటు ప్రాచీనములు కావు. రెండింటినీ అర్థం చేసుకోకుండా చేసిన భ్రష్టుపట్టిన వ్యవస్థలు. అందుకే నేటి సమాజం ఈ విధంగా అన్ని రంగాలలోనూ భ్రష్టు పడుతున్నది. ఇది ఇలాగే కొనసాగితే సమాజం పూర్తిగా నాశనము కాకతప్పదు” అని ఆయన స్పష్టంగా చెప్పారు.

నేటి అస్తవ్యస్తతకు కారణం ధర్మబోధ లుప్తం

కావడమేనని ఆయన భావించారు. అయితే నేటి కాలంలో ధర్మబోధ చేస్తే వినేవారెవ్వరు? అందుకే ఆయన దానికి పరిష్కారమార్గం. ఒక్కటేనని గుర్తించారు. అదే శిరిడీ సాయిబాబా గురించి తెలపడము. కారణం:-

1. ఆయన జననమెక్కడో, తల్లిదండ్రులెవరో తెలియకపోవడం.

2 ఏ మతానికి చెందకపోవడము, సర్వమతాలవారినీ ఆదరించడము.

3 పిలిస్తే పలికే దైవంగా మాత్రమేగాక, సకలజీవుల రూపాలలోనూ, సర్వదేవతా రూపాలలోనూ, సకల సాధువులు, మహాత్ముల రూపంలో కూడా తామే ఉన్నామని నిదర్శనాపూర్వకంగా నిరూపించడము.

4 ఆయన వద్ద ఆర్తులు, అర్థార్థులు, ముముక్షువులు, జిజ్ఞాసువులూ కూడా తమకు కావలసినవి పొందగలగడము.

అందుకే మొదటగా అనేక సమస్యలతో సతమతమవుతున్న ప్రజలకు బాబాను సేవించడం వలన కోరికలు తీరి, ఆయన యందు భక్తి విశ్వాసాలు, దృఢంగా కలగడానికి అవకాశముందని పూజ్యశ్రీ మాస్టరుగారు గ్రహించారు. అందుకే ఆయన లీలలను వివరిస్తూ 'శ్రీ సాయిలీలామృతము' అను గ్రంథము వ్రాసి ప్రజలకు అందించారు. అందువలన అసంఖ్యాకమైన ప్రజలు నేటికీ శిరిడీ వెళ్ళి ఆయనను సేవిస్తున్నారు. తరువాత బాబావలన కోరికలు తీర్చుకోవడం మాత్రమే చాలదని, మనకు కావలసిన శాంతి లభించాలంటే ఆయన బోధనలను అర్థం చేసుకుని ఆచరించడం ముఖ్యమని తెలియజేస్తూ 'శ్రీ సాయినాథ ప్రబోధామృతము' అనే గ్రంథాన్ని రచించారు. తద్వారా ధర్మప్రబోధం జరిగి మానవులలో ధర్మప్రవర్తన అలవడగలదని ఆయన భావించారు.

అంతేగాక సత్యాన్ని గూర్చి తెలుసుకోదలచిన జిజ్ఞాసువులకు 'ఏది నిజం' అనే గ్రంథాన్ని రచించి అసలు సత్యమేమిటో విశదపరచారు.

మతమౌఢ్యంతో అలమటిస్తున్నవారికి మతమంటే ఏమిటో వివరిస్తూ 'మతమెందుకు?' అనే గ్రంథం రచించారు.

'అసలు భగవంతుడున్నాడా? వుంటే ఎలా వుంటాడు?' అని ప్రశ్నించేవారి కోసం ఆధునిక విజ్ఞానాన్ని, ఆధ్యాత్మిక జ్ఞానంతో సమన్వయపరస్తూ 'విజ్ఞాన వీచికలు' అనే గ్రంథం రచించారు.

అసలు ఆధ్యాత్మికత అంటే ఏమిటో, నిజమైన ఆధ్యాత్మికవేత్తలు ఎలా వుంటారో తెలియజేస్తూ ఎంతోమంది అసలైన మహాత్ముల చరిత్రలు రచించారు.

అలాగే భగవంతుడంటే ఏమిటో సరిగా తెలుసుకోకుండా భగవంతుడు లేడని గుడ్డిగా విశ్వసించే, భగవంతుడిని నమ్మడం మూఢనమ్మకమని నిరసించే నాస్తికులనూ, హేతువాదులనూ వ్యతిరేకించారు.

అలాగే భగవంతుడంటే ఏమిటో సరిగ్గా తెలుసుకోకుండా భగవంతుడిని గుడ్డిగా నమ్మే ఆస్తికులను గూడా ఆయన నిరసించారు.

నిజంగా భగవంతుడిని గుడ్డిగా లేడనుకునే వారూ, గుడ్డిగా వున్నాడనుకునే వారూ ఇద్దరూ తమ గుడ్డి నమ్మకాలను గట్టిగా పట్టుకుని వ్రేలాడే మూఢనమ్మకస్తులేనని ఆయన ధైర్యంగా చెప్పి వారికి ఎదురు నిలబడ్డారు.

నేటి వైజ్ఞానిక విజ్ఞానాన్ని, ఆధ్యాత్మికతనూ సమన్వయపరచి భగవంతుడు వున్నాడని నిరూపించడం అయనలోని ప్రత్యేకత.

వైదికతను - నాగరికతనూ, ఆధ్యాత్మికతనూ ఆధునిక వైజ్ఞానికతనూ సమన్వయపరచిన మహామనీషి పూజ్యశ్రీ మాస్టరుగారు.

ఇప్పుడు చెప్పండి?

పూజ్యశ్రీ మాస్టరుగారు ఆధ్యాత్మికవేత్తా,

వైదిక సంప్రదాయ పురుషుడా?

ఆధునిక మానవుడా?

నేటి వైజ్ఞానిక శాస్త్రజ్ఞుడా?

సమాజ సంస్కర్తా?

సమాధానం???

ఆయన అన్నీను. ఎందుకంటే అయన శిరిడీ సాయి సద్గురుని అనుగ్రహంతో సృష్టి రహస్యాన్ని సంపూర్ణంగా తెలుసుకున్న పరిపూర్ణుడు గనుక.

అందుకని సృష్టిలోని అన్ని విషయాలూ ఆయనకు క్షుణ్ణంగా అవగతమవడంలో ఆశ్చర్యమేమున్నది?

అందుకని పూజ్యశ్రీ మాస్టరుగారు మహాపురుషుడు, సర్వసమన్వయకర్త, పరిపూర్ణ అవతార పురుషుడు. ●

సజీవ సన్నిధి!!

(సద్గురు స్వరూపిణి పూజ్యశ్రీ అలివేలు మంగమ్మ తల్లి సన్నిధానం)

శ్రీమతి అడిదం వేదవతి

మన గురుపత్ని, సద్గురు స్వరూపిణి, పూజ్యశ్రీ అలివేలు మంగమ్మ తల్లి రెండవ ఆరాధనా మహోత్సవాన్ని మనమందరం జరుపుకోబోతున్నాం. వారు మనలను ఉద్ధరించటం కోసం ఏర్పరచుకున్న శరీర పరిమితిని దాటి, విశ్వవ్యాప్తమైన నిజస్థితిని చేరి నేటికి రెండు సంవత్సరాలు. ఈ రెండు సంవత్సరాల కాలం ఎలా గడిచిపోయిందో తెలియటం లేదు! వారి పవిత్ర సన్నిధిలో నిరంతరం జరుగుతున్న లీలలు, భక్తులకు వారు ప్రసాదిస్తున్న అద్భుతమైన అనుభవాలూ.. అందరి హృదయాలను ఆధ్యాత్మిక పారవశ్యంతో పులకింపచేస్తున్నాయి. వారి నిత్య సత్య స్వరూపాన్ని భక్తులకు నిరూపించి భక్తిని దృఢతరం చేస్తున్నాయి. ఆ సన్నిధి యొక్క ఉన్నతమైన ఆధ్యాత్మిక ప్రభావాన్ని చాటుతున్నాయి. పూజ్యశ్రీ అమ్మగారి సమాధి మందిరాన్ని దర్శించి వారిని శరణుపొందిన ఎందరికో ఎన్నో కష్టాలు, కోరికలు తీరాయి. వారు ప్రత్యక్ష దర్శనం ఇచ్చిన సందర్భాలెన్నో!! ఎంతోమంది సాధకులు ఆ సన్నిధి యొక్క మహోన్నతమైన ఆధ్యాత్మిక ప్రభావానికి ముగ్ధులైపోయారు. అడుగడుగునా వారి మార్గదర్శకత్వం పొందుతున్నారు.

పూజ్యశ్రీ అమ్మగారిలోని ప్రశాంతత, సహజత్వం, మౌనం వారి సన్నిధిలో ఆనాడు, ఈనాడూ ప్రస్ఫుటం. ఇప్పుడు వారి పవిత్రమైన సమాధి ప్రకృతి ఒడిలో ఒక నిశ్శబ్ద ధ్యానస్థ ప్రదేశంలో వుంటుంది. వారు తమ సహజస్థితిలో కొలువై వున్న ఆ సన్నిధి మనకు తెలియకుండానే మన మనసులలో ఎంతో నిగూఢమైన, లోతైన, తీవ్రమైన ఆధ్యాత్మిక ప్రభావాన్ని కలిగిస్తుంది. అక్కడికి వెళ్ళగానే దానిని అనుభవిస్తుండే మనం, "అబ్బా! మన అమ్మగారి సన్నిధి ఎంత ప్రశాంతంగా వుంది! ఈ ప్రదేశాన్ని అస్సలు వదిలి వెళ్లాలనిపించడం లేదు! ఎప్పటికీ ఇక్కడే వుండిపోవాలనిపిస్తుంది" అంటాము. ఆ సన్నిధిని విడిచి వెళ్ళవలసి వచ్చినప్పుడు మనకెంతో విలువైనదానిని, ముఖ్యమైనదానిని వదిలి వెళుతున్నట్లుగా మనలో ఏదో కలవరం, ఏదో అలజడి. మళ్లీ ఆ సన్నిధికి వెళ్తున్నామంటే ఒక్కసారిగా మనసు పులకరిస్తుంది, ఆనందం, ఉత్సాహంతో నిండిపోతుంది. పూజ్యశ్రీ అమ్మగారి పవిత్ర సన్నిధి ఒక అనిర్వచనీయమైన మధురమైన దివ్యానుభూతి. దానిని అనుభవించగలమే కానీ, మాటలలో వర్ణించలేము!

'పూజ్యశ్రీ అమ్మగారి సన్నిధికి, దాని ప్రభావానికి, మన అనుభవానికీ వున్న సంబంధం ఏమిటి?' అని ఆలోచిస్తే ఒక విషయం స్పష్టమవుతుంది. సమర్థ సద్గురువైన శ్రీ సాయినాథులు పరిపూర్ణ దత్తావతారము, పరిసమాప్తిలేని సద్గురు స్వరూపమైన

అవతారము. అంతటి సద్గురువైన సాయినాథుని ఎలా సేవించి తరించాలో తాము బోధించి, ఆచరించి, మనకు మార్గదర్శకంగా అవతరించిన సద్గురు స్వరూపమైన దత్తావతారమే శ్రీ అలివేలుమంగా సమేత భరద్వాజ గురుదేవులు. మన గురుపత్ని పూజ్యశ్రీ భరద్వాజ గురుదేవుల స్వరూపమే పూజ్యశ్రీ అమ్మగారు. పూజ్యశ్రీ అమ్మగారి ఔన్నత్యాన్ని వారి సమకాలీన మహాత్ములైన శ్రీ సంత్ గులాబ్ బాబా, శ్రీ సుధీంద్రబాబుగారు, శ్రీ పాకలపాటి గురువుగారు, శ్రీ అనసూయామాత, శ్రీ మాయి అమ్మ స్పష్టం చేశారు. అంతటి సద్గురు స్వరూపమైన పూజ్యశ్రీ అమ్మగారి ఆధ్యాత్మిక పరిపూర్ణతతో నిండిన ప్రదేశమే వారి సమాధి మందిరం – వారి పవిత్ర సన్నిధి. మన మనసులలో ఆ సన్నిధి కలిగించే ప్రభావమే మనకు తెలియకనే మనకు అనుభవమౌతుంది. ఆ ఆధ్యాత్మిక పరిపూర్ణత యొక్క ప్రభావమే మన కలిగే దివ్యానుభూతి. అయితే మనము ఎంత సన్నద్ధంగాను, స్వచ్ఛతతోను ఆ సన్నిధికి వస్తామో అంతగా ఆ అనుభూతి యొక్క తీవ్రత వుంటుంది. అయినప్పటికీ మనం ఎంతటి మలినమైన మనసులతో వెళ్లినా అంతో ఇంతో ఆ సన్నిధి ప్రభావాన్ని అనుభవించవచ్చు. అందులోనూ పూజ్యశ్రీ అమ్మగారిని స్మరించగానే అందరికీ గుర్తుకువచ్చేది వారు కురిపించే అంతులేని ప్రేమ. అందుకే అక్కడకు వచ్చిన వారందరికీ వారు వర్షించే అంతులేని అవ్యాజమైన ఆధ్యాత్మిక మాతృత్వ ప్రేమ అనుభవమౌతుంది. ఆ అనుభూతిని సాధ్యమైనంతగా నిలుపుకోగలిగితే మనం పూజ్యశ్రీ అమ్మగారి సన్నిధికి వెళ్ళిన ప్రతిసారీ మన మనసులను వారి పవిత్ర సన్నిధిగా మార్చుకుని మనతో తీసుకుని వెళ్ళవచ్చు. అదే ఆ సన్నిధియొక్క తత్వము, ప్రయోజనము కూడా!

పూజ్యశ్రీ అమ్మగారు ఎప్పుడు, ఎక్కడ వున్నా, ఎక్కడికి వెళ్లినా, తామున్న ప్రదేశాన్ని అత్యంత అద్భుత ఆధ్యాత్మిక శక్తి క్షేత్రంగా అలవోకగా మార్చివేసేవారు. వారి ప్రత్యక్ష సన్నిధిని అనుభవించిన ప్రతివారికి ఈ విషయం నిత్యానుభవమే! ఇంతకుముందు లేనంత శుభ్రంగా, అందంగా భక్తితో తామున్న ప్రదేశాన్ని తీర్చిదిద్ది, దానిని శ్రీ సాయిని, పూజ్యశ్రీ మాస్టరుగారిని సేవించేందుకు అనువైన ప్రదేశంగా మార్చి, అక్కడ ఆ సద్గురుమూర్తులను ప్రతిష్ఠించేవారు. ఇక వారి సేవలో క్షణక్షణం గడిచేది. వారికి నివేదనలు, సేవలు, సత్సంగాలు, భజనలు, హారతులు, పూజలతో ఆ ప్రదేశం మారుమ్రోగేది. ఒక ఆధ్యాత్మిక మహా క్షేత్రంగా మారిపోయేది! అజ్ఞానంతో నిండిన మనకు సహజంగా వుండే, 'ఉన్నదానితో అసంతృప్తి లేని దేనికోసమో తపన' అనే అంతులేని దుఃఖం వారి పవిత్ర సన్నిధిలో శమించి ఆనందం, ఆహ్లాదం, ఉత్సాహంతో మన మనసులు నిండిపోయేవి! యాంత్రికంగాను, భారంగాను, నిరుత్సాహంగాను మారిపోయిన మన ఆధ్యాత్మిక సాధన వినూత్నమైన, వివేకపూరితమైన అవగాహన పొంది, నూతన ఉత్సాహంతో నిండి, ఒక ఆనందదాయకమైన, సరళమైన పరిణతితో ముందుకు సాగేది! నిస్సారంగా, భారంగా, యాంత్రికంగా, పరాధీనంతో నిండినట్లు అనిపించే జీవితం ఆ పవిత్ర సన్నిధిలో వివేకమంతమైన, వికాసమంతమైన, ఉత్సాహభరితమైన, ఆనందమయమైన, స్వేచ్ఛా స్వాతంత్ర్య జీవితంలా మారిపోయేది! జీవితం పట్ల మన దృక్పథం చక్కటి మార్పు చెంది ఆత్మవికాస దోహదమైన, దుర్లభమైన, అమూల్యమైన అవకాశంగా పరిణతి చెందేది! అది ఎంతటి అవకాశమో, దానిని ఎలా సద్వినియోగపరచుకోవాలో తెలియచెప్పే పూజ్యశ్రీ అమ్మగారి బోధల వలన, అట్టి జీవితం ప్రసాదించిన సద్గురువు పట్ల కృతజ్ఞత, ప్రేమలు పరిపుష్టమై భక్తి అంతకంతకు స్థిరపడేది! తమను ఆశ్రయించి, సేవించేవారికి సంపూర్ణమైన రక్షణ, ఆనందం, ఉత్సాహం, స్వేచ్ఛ, ఆధ్యాత్మిక ఔన్నత్యము ప్రసాదించే అతి పవిత్ర శక్తి క్షేత్రం పూజ్యశ్రీ అలివేలు మంగమ్మ తల్లి సన్నిధి. మనలో ఆధ్యాత్మిక బీజం మొలకెత్తి మహావృక్షంగా మారేందుకు అవసరమైన ఆధ్యాత్మిక పరిణతిని, ప్రభావాన్ని, పరిపాకాన్ని ప్రసాదించి దానిని పరిరక్షించే ఆరోగ్యకరమైన, సారవంతమైన సుక్షేత్రంగా మన మనసులను మార్చివేస్తుంది. అట్టి సారమే లేకుంటే ఆ బీజం అలాగే మొలకెత్తకుండానే వుండిపోతుంది, ఎప్పటికీ!!

మనం మనకు తెలియకుండానే చిన్నప్పటినుండి అలవాటైన పాత అభిప్రాయాలను, పాత సిద్ధాంతాలను, పాత పద్ధతులను, పాత ఆచారాలను అంటి పెట్టుకుని జీవిస్తూ వుంటాము. యాంత్రికంగా ఆధ్యాత్మిక సాధనలను – అంటే ధ్యానము, జపము మొదలైనవి చేస్తూ ఆధ్యాత్మికంగా ఉన్నతులమని అహంకరిస్తాము. అట్టి వివేకహీనమైన, ఆత్మవికాసరహితమైన ఆచరణ ఆధ్యాత్మిక

ఔన్నత్యాన్ని ప్రసాదించే బదులు ఇంకా మనకు, సాటివారికీ హాని కలిగించి, పతనానికి దారితీస్తుంది. పూజ్యశ్రీ అమ్మగారి సన్నిధిలో అటువంటి సంకుచితమైనవన్నీ పటాపంచలౌతాయి. ఆ పవిత్ర సన్నిధి యొక్క తత్వాన్ని తెలుసుకోచూసినప్పుడు అటువంటి మూసపోసిన జీవితం నుండి క్షణక్షణం ఆత్మవికాసం పొందేందుకు అనేక అవకాశాలను, సందర్భాలను విస్తృతంగా ప్రసాదించే ఒక సంభావ్యంగా జీవితం కనిపిస్తుంది. మనం జీవితాన్ని చూసే, అనుభవించే ఒక అనారోగ్యకరమైన పరిధినుంచి చక్కటి వ్యక్తిగత, సామాజిక ఆరోగ్యాన్ని ప్రసాదించి, ఆరోగ్యకరమైన పరిధిలోకి జీవితం మారిపోతుంది. సంకుచితమైన మన దృక్పథం వివేకభరితమైన, ఆరోగ్యకరమైన, పరస్పర శ్రేయోదాయకమైన విశాల దృక్పథంగా మారి ప్రపంచం వసుధైక కుటుంబంగా, సద్గురుస్వరూపంగా గోచరిస్తుంది. పూజ్యశ్రీ అమ్మగారి అపార కరుణతో, అనుగ్రహంతో అణువణువూ నిండిన ఆ పరమ పవిత్ర సన్నిధిలో మనం ఎంతటి ఉన్నతమైన ఆధ్యాత్మిక పరిపాకన్నైనా సాధించవచ్చు!

పూజ్యశ్రీ అమ్మగారి సద్గురు తత్వము మనకు మార్గదర్శకంగా లభించేందుకు ఆలంబన... వారు 75 సంవత్సరాల పాటు ధరించిన వారి పవిత్ర దేహం! వారి ఉనికిచేత, నిరంతర సాన్నిధ్యం చేత అణువణువు పవిత్రమైన ఆ శరీరం ఎంతటి ప్రభావితమైనదో! వారి నిజతత్వానికి, వారి అవతారకార్యానికి వారధిగా నిలిచి మనలను ఉద్ధరించేందుకు రూపుదిద్దుకున్న అనుగ్రహానికి ప్రతీక! స్థూలమైన, పరిమితమైన వారి రూపానికి, సూక్ష్మమైన అపరిమితమైన, విశ్వవిశాలమైన, సర్వవ్యాపకత్వ, సర్వసాక్షిమత్వ, సర్వజ్ఞత్వ భగవత్ తత్వానికి, తమ బిడ్డలకు జన్మనిచ్చి, వాత్సల్యంతో పెంచి, పోషించి, రక్షించే జగన్మాత తత్వానికి సంగమం.. త్రివేణీ సంగమం.. పూజ్యశ్రీ అమ్మగారి సన్నిధి. కనుక మనకెన్ని బలహీనతలు వున్నా, మనం ఎటువంటి వారమైనా తమను భక్తిశ్రద్ధలతోనూ, నిష్ఠ, ఓరిమి తోను సేవించేందుకు నిజాయితీగా, నిర్విరామంగా ప్రయత్నించేవారిని మహాత్ములుగా తీర్చిదిద్దే దత్తాత్రేయ తత్వానికి, సద్గురు సంప్రదాయానికి అనుసంధానమైన ప్రకృతి సూత్రమే ఆ సన్నిధి.

పూజ్యశ్రీ అమ్మగారి సన్నిధిలో వారి సేవలు అందుకుంటూ పూజ్యశ్రీ మాస్టరుగారు, సమర్థ సద్గురు అయిన శ్రీ సాయినాథులు కొలువైవుంటారు. ఆ సమర్థ సద్గురువుల సన్నిధిని ఆశ్రయించి సకల దేవతలు, సకల సాధుసత్పురుషులు వారిని సేవిస్తూ వుంటారు. సకల తీర్థాలు వారి పవిత్ర పాదాలలోనే వుంటాయి. కనుక ఆ సద్గురుత్రయాన్ని ఆరాధిస్తే సకల దేవతలను ఆరాధించినట్లు! సకల సాధసత్పురుషులను, మహాత్ములను సాక్షాత్తు దత్తస్వామిని సేవించినట్లు! సకల తీర్థాలను దర్శించినట్లు! ఈ విషయాన్ని ఏమరక గుర్తుంచుకుని తగిన భక్తిశ్రద్ధలతో సేవించడమే మనం చేయవలసింది!

పూజ్యశ్రీ అలివేలు మంగమ్మతల్లి పవిత్ర సన్నిధానంలో కాసేపు కూర్చుందాం. పూజ్యశ్రీ అమ్మగారి ఔన్నత్యాన్ని మనసు నిండా నింపుకుని వారిని శరణుపొందుదాం. వారి నిజతత్వాన్ని ధ్యానిద్దాం. వారి సద్గురు తత్వాన్ని, సచ్ఛిష్య తత్వాన్ని స్మరిద్దాం. పూజ్యశ్రీ మాస్టరుగారి ప్రతిరూపంగా పూజిద్దాం, సేవిద్దాం. ఆ జగజ్జనని దివ్య మాతృ వాత్సల్యాన్ని మనసారా అనుభవిద్దాం. అక్కడున్న ఆధ్యాత్మిక శక్తి క్షేత్రం నుంచి సాధనాశక్తిని, సామర్థ్యాన్ని పొందుదాం. ఆ శక్తి ప్రభావంతో మన దైనందిన లౌకిక కార్యక్రమాలన్నీ సక్రమంగా, ధర్మబద్ధంగా సాగి, మనం వాటి ప్రభావాలకు లొంగకుండా, వాటిని మనకు ఆధ్యాత్మిక శిక్షణను ప్రసాదించే పూజ్యశ్రీ అమ్మగారి ప్రసాదాలుగా గుర్తిద్దాం. ఆ పవిత్ర సన్నిధిలో ధ్యానము, జపము, పారాయణవంటి వ్యక్తిగత సాధన మాత్రమే కాక, సత్సంగము, ఆరతులు, అభిషేకము, సామూహిక పూజ, సద్గ్రంధపఠన, సేవ వంటి సామూహిక సాధనను పరిపుష్టం చేసుకుని, వారి బోధల సహాయంతో వాటిని చక్కగా మేళవించుకుంటూ ఉన్నతమైన ఆధ్యాత్మిక జీవితానికి పునాది వేద్దాం. సుస్థిరమైన ఆధ్యాత్మిక జీవితమనే సురక్షిత భవనాన్ని నిర్మించుకుందాం. అందులో ఆ సద్గురు మార్గంలో మన జీవితాన్ని సాగిద్దాం. మనం ఆర్తులమైనా, అర్థార్థులమైనా, జిజ్ఞాసులమైనా, ముముక్షువులమైనా మనకు అవసరమైన లాలనను, పాలనను, పోషణను, శిక్షణను ఇచ్చి సన్మార్గం వైపు నడిపించే ఆ జగజ్జనని పూజ్యశ్రీ అలివేలు మంగమ్మ తల్లికి సంతోషం కలిగించే సంతానమౌదాం. అట్టి ప్రయత్నం చేసే వారందరికీ ఆ సన్నిధి ఎప్పటికీ సజీవమే! మనం లౌకికమైన కోరికలను

మిగతా 29వ పేజీలో

మాతృదేవి స్మృతులు

శ్రీమతి వెల్లంకి విజయలక్ష్మి

పూజ్యశ్రీ అలివేలుమంగమ్మతల్లి లీలా వైభవాన్ని హైదరాబాదుకు చెందిన వెల్లంకి విజయలక్ష్మిగారు ఈవిధంగా తెలియచేస్తున్నారు--

పూజ్యశ్రీ మాస్టరుగారు సమాధి చెందిన తరువాత మాకు దిక్కెవరని బాధపడుతుంటే పూజ్యశ్రీ మాస్టరుగారు స్వప్న దర్శనమిచ్చి పూజ్యశ్రీ అమ్మగారిని ఆశ్రయించమని సూచన చేశారు. అప్పటినించి పూజ్యశ్రీ మాస్టరుగారి ప్రతిరూపంగా పూజ్యశ్రీ అమ్మగారిని సేవించుకుంటున్నాము. పూజ్యశ్రీ అమ్మగారు నాకు ప్రసాదించిన కొన్ని అనుభవాలని మీతో పంచుకుంటాను--

మల్కాజిగిరిలో పూజ్యశ్రీ అమ్మగారు వున్నప్పుడు ఎక్కువగా దర్శనానికి వెళ్లేదానిని. ఒక సందర్భంలో నేను పూజ్యశ్రీ అమ్మగారికి వస్త్రాలు సమర్పించుకున్నాను. అప్పుడు నాకు ఒక ఆలోచన వచ్చింది-- 'ఎంతోమంది ఎన్నెన్నో మంచి మంచి వస్త్రాలు సమర్పించుకుంటారు, నేను సమర్పించిన ఈ వస్త్రాలు పూజ్యశ్రీ అమ్మగారు కట్టుకుంటారా?' అని! మళ్ళీ ఆ ఆలోచన చాలా తప్పనిపించింది. తరువాత కొన్నాళ్ళకి పూజ్యశ్రీ అమ్మగారి దర్శనానికి వెళ్లాను. ఆశ్చర్యం!!! నేను సమర్పించిన చీరనే పూజ్యశ్రీ అమ్మగారు ధరించి వున్నారు!!! నాకు ఆనందంతో కళ్ళనిండా నీళ్లు తిరిగాయి. అప్పటి ఆ పూజ్యశ్రీ అమ్మగారి రూపం ఇప్పటికీ నా కళ్ళకి కట్టినట్టు వుంటుంది. నేను అదేరోజు వస్తానని, నేను సమర్పించిన చీరనే కట్టుకోవాలని పూజ్యశ్రీ అమ్మగారికి అనిపించడం ఆమె సర్వజ్ఞతకు నిదర్శనం !!

నాకు 2007లో గర్భసంచీలో గడ్డ వచ్చిందని నాకు ఆపరేషన్ చేశారు. అదే రోజు రాత్రి పూజ్యశ్రీ అమ్మగారు నాకు కలలో కనిపించారు. బాగా మిగలముగ్గిన అరటిపండు చేతిలో పట్టుకుని వున్నారు. అది చాలా నల్లగా వుంది. నేను ఆశ్చర్యంగా చూస్తున్నాను. పూజ్యశ్రీ అమ్మగారు, "తీసేశాను, నీకేమి భయం లేదు" అన్నారు!!

పూజ్యశ్రీ మాస్టరుగారు ఒక భక్తుడికి పాదుకలు ప్రసాదించారని, అవి ఇప్పుడు విద్యానగర్ గుడిలో వున్నాయని తెలిసి వాటిని దర్శించుకోవడానికి విద్యానగర్ వెళ్ళాము. అక్కడకి వెళ్ళాక నాకనిపించింది-- 'నేను కూడా ఒక జత పాదుకలు తెచ్చుకుని , ఆ పాదుకలు పెట్టివున్న పెట్టెకు తాకించుకుంటే మా ఇంట్లో కూడా పూజ్యశ్రీ మాస్టరుగారి పాదుకలు వున్నట్లు వుంటుంది కదా! నేను కూడా వాటిని పూజించుకోవచ్చు!' అనుకుని, "అలా తాకించి ఇస్తారా?" అని అక్కడివారిని అడిగాను. వాళ్ళు ఒప్పుకున్నారు. నేను వెంటనే బజారుకు వెళ్లి హవాయి చెప్పులు కొని తెచ్చి వాటిని తాకించుకుని ఇంటికి తెచ్చుకున్నాను. కానీ ఎందుకో చాలారోజులు పూజలో పెట్టుకోలేదు. 2008లో ఒకసారి నాగోలులో పూజ్యశ్రీ అమ్మగారి దర్శనానికి వెళ్తూ నాదగ్గరున్న పాదుకలు కూడా తీసుకెళ్ళాను. జరిగినదంతా పూజ్యశ్రీ

మిగతా 29వ పేజీలో

వార్తాలాపము

(గత సంచిక తరువాయి)

శ్రీమతి అడిదం వేదవతి

శ్రీ ప్రకాశానంద స్వామివారిచే విరచితమైన వార్తాలాపమనే యీ గ్రంథము గ్రాంథికభాషలో వ్రాయబడి వుండటం వలన తమకు అర్థంగావడం లేదని చాలామంది పాఠకులు అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు. అందుకని పాఠకుల అభ్యర్థన మేరకు పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారి ప్రియపుత్రిక శ్రీమతి అడిదం వేదవతిగారు సరళమైన భాషలో ఈ గ్రంథాన్ని పాఠకులకు అందజేస్తున్నారు - ఎడిటర్.

పదవ ప్రసంగము

సంవర్గోపాసనలో సంవర్గ గుణాలు గల వాయువును ధ్యానించాలి. అలాగే ముఖ్యమైన ప్రాణము నిదురించే సమయంలో వాక్కు మొదలైన వాటిని పశపరుచుకుంటుంది. కాబట్టి దీనిని ధ్యానించాలి. ఇక్కడ కూడా వాక్కు మొదలైన వాటిని వశపరచుకోవటం అనే కర్మను ఆధారంగా చేసుకొని ప్రాణాన్ని సంవర్గ రూపంలో ఉపాసించాలి.

సంవర్గోపాసన ఆధి దేవ, ఆధ్యాత్మ భేదాల వల్ల రెండు రకాలు. చాందోగ్యములో "వాయుర్వావ సంవర్గః, ప్రాణో వావ సంవర్గః" అని చెప్పబడింది.

జ్ఞానము

ప్రపంచంలోని అన్ని వ్యవహారాలకు అసాధారణమైన కారణము జ్ఞానము. పదార్థ జ్ఞానము లేకపోతే పదార్థ సంబంధమైన వ్యవహారం జరగదు. జ్ఞానము – పరోక్షము, అపరోక్షము అని రెండు రకాలు.

భేదముల చేత విశిష్టమైనది (ప్రత్యేకమైనది), విషయ విషయకాలతో కూడినది అయిన జ్ఞానము పరోక్ష జ్ఞానము. పరోక్ష జ్ఞానము కలగనిదే ఏ పదార్థం యొక్క అపరోక్ష జ్ఞానము కలుగదు. అపరోక్ష జ్ఞానము కన్నులు మొ॥న ఇంద్రియాల ద్వారా అభేద బోధకాలైన (అభేదాన్ని బోధించే) వాక్యాల ద్వారా (మాటల ద్వారా) కలుగుతుంది. కర్మలు నిష్కామంగాను (ఎటువంటి ప్రతిఫలం లేకుండా), సకామంగాను (ప్రతిఫలం ఆశించి) చేయబడుతుంటాయి. అవి కూడా ఆ శబ్దవిషయజ్ఞానము చేతనే చేయబడతాయి. కాబట్టి కర్మకు కూడా జ్ఞానమే కారణము. అలాగే ఉపాసన కూడా జ్ఞానమే కారణము. ఎందుకంటే ఉపాస్య పదార్థము గురించి (ఉపాసింపబడే దానిని గురించి), ఉపాసన సాధనము గురించి (ఏ సాధనము చేతనైతే ఉపాసన జరుగుతుందో దాని గురించి) జ్ఞానము లేకపోతే ఉపాసన జరగదు. ఉపాసన, జ్ఞానము రెండు మనస్సు యొక్క వృత్తులే!

క్రియా (చేసే పని), కారక (దానిని చేసేది), ఫల (దాని యొక్క ఫలితము) అనేటటువంటి భేదాలే లేని కూటస్థ రూపమైన ఆత్మలో అవిద్య వలన చేయబడే కర్త మొ॥న

కారక విషయాల ఆరోపము (ఆపాదించడం), ఆ ఆరోపిత విజ్ఞాన నివర్తకము అయిన (అటువంటి విజ్ఞానము నుంచి నివృత్తి చేసేటటువంటిదైన) మనోవృత్తే అద్వైత జ్ఞానము.

మహా వాక్యాలనుంచి పుట్టిన అపరోక్ష జ్ఞానము మోక్షానికి కారణము. వేదాంత వాక్యాలు - మహావాక్యాలు, అవాంతరవాక్యాలు అని రెండు రకాలు.

జీవాత్మ, పరమాత్మల స్వరూపాన్ని బోధించేవి అవాంతర వాక్యాలు

జీవాత్మ, పరమాత్మల స్వరూపాన్ని బోధించే వాక్యాలు అవాంతరవాక్యాలు. ఉదా॥ 'య ఏష హృద్యన్తర్జ్యోతిర్పురుషః' - అంటే హృదయాంతర్గతమైన జ్యోతియే పురుషుడు. ఇది జీవుని ప్రతిపాదించే అవాంతర వాక్యము. 'సత్యం జ్ఞానమనన్తం బ్రహ్మ' అనేది బ్రహ్మ ప్రతిపాదకమైన అవాంతర వాక్యము.

జీవబ్రహ్మల అభేదాన్ని ప్రతిపాదించేవి మహా వాక్యాలు. ఉదా॥ 'తత్త్వమసి'(అది నీవు). వినడం (శ్రవణము) తో సంబంధం ఉండటం వలన అవాంతర వాక్యాల ద్వారా బ్రహ్మము యొక్క పరోక్ష జ్ఞానం కలుగుతుంది. 'జీవుడు బ్రహ్మము'. వినికిడి (శ్రవణము) వలన మహావాక్యాల ద్వారా బ్రహ్మము యొక్క అపరోక్ష జ్ఞానము కలుగుతుంది. ఉదా॥ 'అహం బ్రహ్మాస్మి' (నేను బ్రహ్మము).

వ్యవధాన శూన్యమైన (నిరంతరమైన-తెంపులేని) వస్తువు యొక్క శబ్దము ద్వారా (దాని గురించి వినడం ద్వారా) పరోక్ష జ్ఞానము, అపరోక్ష జ్ఞానము రెండూ కలుగుతాయి.

ఎక్కడ వ్యవధాన శూన్య పదార్థము (అంటే మనకు దేని గురించి తెలియదో ఆ నిత్యసత్యమైన వస్తువు) దాని ఉనికి చేత (అస్తిత్వము చేత) తెలియబడుతుందో, అక్కడ పరోక్ష జ్ఞానము వుందని అర్థము. వ్యవధాన శూన్యమైన పదార్థము అలానే తెలుసుకోబడినచోట అపరోక్ష జ్ఞానమని తెలుసుకోవాలి. ఉదా:- 'దశమస్త్వమసి' అనే కథలో పదో పురుష జ్ఞానము (దశమ పురుష జ్ఞానము).

బ్రహ్మము అన్నింటికి ఆత్మ. అన్ని విధాల, అన్నింటికీ వ్యవధానశూన్యమే అయితే (నిరంతరాయమైనది, శాశ్వతమైనది. నిత్యసత్యమైనది) శబ్దము చేత (శ్రవణము ద్వారా)'బ్రహ్మాస్తి' 'బ్రహ్మము వున్నది' అని ఉచ్చరించడం వలన పరోక్షజ్ఞానమే కలుగుతుంది. కాబట్టి వ్యవధాన శూన్యమైన బ్రహ్మము గురించి కూడా పరోక్ష జ్ఞానమే శ్రవణానికి సంబంధించిన అవాంతరవాక్యం ద్వారా తెలుస్తుంది. వ్యవధాన శూన్యమైన ఆత్మకు బ్రహ్మానికి భిన్నమైన శ్రవణ సంబంధమైన (శ్రోత్ర సంబంధమైన) మహావాక్యాల ద్వారా అభేదమైన అపరోక్ష జ్ఞానము కలుగుతుంది. ఉదా॥ నేను బ్రహ్మము. కాబట్టి జీవము బ్రహ్మము మధ్య కల భేదానికి మహావాక్యాలనుంచి పుట్టిన జ్ఞానమే కారణము. ప్రమాణగత అసంభావన (యదార్థమైన జ్ఞానము పట్ల ఉన్న సంశయము), ప్రమేయగత అసంభావన (సిద్ధాంతము పట్ల సంశయం), విపరీత భావన (అసలు భగవంతుడొక్కడే అనే సత్యము పట్ల సంశయము) - ఈ మూడు జ్ఞానానికి ప్రతి బంధకాలు. వాటిని పోగొట్టుకోవడానికి శ్రవణము, మననము, నిధిధ్యాసములను ప్రతిరోజు ముముక్షువు అభ్యసించాలి. వాటి ద్వారా జ్ఞానమార్గంలో విఘ్నాలు రావు. 'జ్ఞానము లేకపోతే ముక్తి లేదు' అని శృతి ఘోషిస్తోంది.

'తమేవ విదిత్వాఽతి మృత్యుమేతి నాన్యః పన్థా విద్యతేఽయనాయ'

ముముక్షువు ప్రత్యగభిన్న (సర్వజీవులలో సాక్షిభూతుడు, దేశకాలాతీతుడైన) భగవంతుని స్వస్వరూపంలో (యథార్థ స్థితిని) తెలుసుకొని ప్రపంచంలో మృత్యువుని దాటుతాడు. ఆత్మజ్ఞానం (స్వస్వరూప ప్రాప్తికి) కలగడానికి జ్ఞానం తప్ప వేరే మార్గము లేదు. జీవుడికి, బ్రహ్మానికి మధ్య తేడాలేదని (అభేదజ్ఞానము) కలుగనిదే మోక్షము కలగదని శ్రీ ఆది శంకరులు చెప్పారు.

శ్లో॥ న యోగేన న సాంఖ్యేన
కర్మణా నో న విద్యయా ।
బ్రహ్మాత్మైకత్వ బోధేన
మోక్షః సిద్ధ్యతి నాన్యథా ॥

భావం:- యోగము, సాంఖ్యము, కర్మ, విద్య(ఉపాసన) - వీటి వలన మోక్షము కలుగదు. బ్రహ్మమునకు ఆత్మకు భేదం లేదనే జ్ఞానము కలిగినప్పుడే మోక్షము సిద్ధిస్తుంది.

ఇది వేదాంత మహావాక్యాల ద్వారా మాత్రమే జరుగుతుంది.

- సశేషం

(గత సంచిక తరువాయి)

మరికొందరు భక్తులు

పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ

థక్కర్ :

"థక్కర్ ధరమ్ సే జతాబాయి" అనే కంపెనీలో ప్రధాన గుమాస్తాగా పనిచేస్తున్న కాకా మహాజని తరచుగా శిరిడీవచ్చి, సాయి అనుమతిస్తేగాని తిరిగి యింటికి వెళ్ళేవాడు గాదు. అతడంతగా దర్శించే సాయిని తానుగూడ స్వయంగా దర్శించి పరీక్ష చేసి చూడాలని తలచి, ఒకసారి ఆ కంపెనీ అధికారి థక్కర్ అతనితో గూడ శిరిడీ చేరాడు. కాకా మహాజని వెంటనే తిరుగు ప్రయాణమవడానికి సాయి అనుమతించరేమోనని శంకించి, అతనొక మిత్రుణ్ణి తోడుగా తెచ్చుకున్నాడు. బాబాకు సమర్పించడానికని దారిలో కాకా మహాజని కొద్ది ఎండు ద్రాక్షపండ్లు కొని వుంచుకున్నాడు. ఆ ముగ్గురూ శిరిడీ చేరగానే అక్కడ థక్కర్‌కు మరొక స్నేహితుడు కన్పించాడు. బాబా మహిమలేమైనా ప్రదర్శిస్తారా అని థక్కర్ అతనిని విచారించాడు. అతడు తాను కేవలం సాయి ఆశీస్సుల కోసమే శిరిడీ వచ్చానని చెప్పి, భక్తులు హృదయ పూర్వకంగా కోరుకున్నదేదీ అక్కడ నెరవేరకుండా పోదని చెప్పాడు.

అందరూ ద్వారకామాయి చేరాక, కాకా మహాజని సాష్టాంగ నమస్కారం చేసి, సాయికి ద్రాక్షపండ్లు సమర్పించాడు. సాయి వాటిని తిరిగిచ్చి, అందరికీ ప్రసాదంగా పంచమన్నారు. వాటిలో కొన్ని థక్కరుకు కూడ లభించాయి. అతడికి ద్రాక్షపండ్లు సహించవు. అయినప్పటికీ వాటిని నోట్లో వేసుకుని, వాటిలోని గింజలు ఎక్కడ వేయాలో తెలియక జేబులో వేసుకున్నాడు. "బాబా మహాత్ముడే అయితే, ఇవి నాకు సహించవని తెలుసుకోవాలిగదా! అవే నాకు ప్రసాదంగా ఎందుకిచ్చారు?" అనుకున్నాడు. వెంటనే అతడికి బాబా మరికొన్ని ద్రాక్షపండ్లిచ్చి వాటిని తినమని ఆదేశించారు. వాటిని నములుతున్నప్పుడు వాటిలో ఒక గింజ కూడ లేకపోవడం గమనించి, అదెలా సంభవమా అని థక్కర్ నివ్వెరబోయాడు. అతడేదైనా మహిమ చూడాలనుకున్నందుకు బాబా అలా చేసారని అతడు తలచాడు. అతని స్నేహితుణ్ణి 'నీకిచ్చిన ద్రాక్షపండ్లెలా వున్నాయి?' అని అడిగారు బాబా. అతడు తాను తింటున్న ద్రాక్షపండ్లలో గింజలున్నాయని చెప్పాడు. ఆ మాట విని థక్కర్ పులకించిపోయి, బాబాను తక్కువగా అంచనా వేసుకున్నందుకు తనను తానే నిందించుకున్నాడు. అయినా వెంటనే అతని మనసులో మరొక భావం మెదిలింది. బాబా మహాత్ముడే అయితే మరొక్కసారి ఆయన కాకాతో ప్రారంభించి ద్రాక్షపండ్లు పంచాలనుకున్నాడు. వెంటనే బాబా సరిగ్గా అలానే చేయడంతో అతడు నిశ్చేష్టుడయ్యాడు.

అంతలో ఆరతి పూర్తయి అందరూ బాబావద్ద సెలవు తీసుకుంటుంటే తమతోపాటు తిరుగు ప్రయాణమవడానికి కాకాకు గూడ సాయి అనుమతివ్వాలని థక్కర్ అనుకున్నాడు. సామాన్యంగా బాబా ఎప్పుడూ అతనికి అనుమతివ్వక కొద్దిరోజులు శిరిడీలోనే వుంచుకునేవారు. అలాంటిది ఆ రోజున వెంటనే అనుమతిచ్చారు. థక్కర్ మరో మహిమ చూచాడు.

అపుడు కాకాను ₹15/-లు దక్షిణ అడిగి బాబా, 'నేనెవరినుండైనా దక్షిణ తీసుకుంటే అందుకు బదులుగా అతనికి పదిరెట్లు ఇవ్వవలసి వుంటుంది. ఆ ఫకీరు ఎవరిని చూపుతారో వారిని మాత్రమే దక్షిణ అడిగి తీసుకుంటాను. అతడది సమర్పించి ముందు ముందు ఎంతటి ప్రతిఫలమో పొందుతాడు. ధనమన్నది ధర్మం చేయడానికి సాధనమవ్వాలి. దానమివ్వడమే సిరిసంపదలు పొందడానికి ఉత్తమమైన మార్గం. దక్షిణ సమర్పించడం వలన వైరాగ్యం

(గత సంచిక తరువాయి)

శ్రీశ్రీశ్రీ మాతా ఆనందమయి జీవితం మరియు బోధలు

శ్రీమతి శ్రీదేవి

శ్రీ ఆనందమయి అమ్మ ఆదేశించిన విధివిధానాలను తు.చ. తప్పక పాటిస్తూ ఆధ్యాత్మిక సాధనలో ముందుకు సాగుతున్న సాధకులు ఎంతో అప్రమత్తతతో ముందుకు సాగవలసి వుంటుందని ఆమె హెచ్చరించేవారు. మీరు మిమ్మల్ని, మీ స్థితిగతులను గుప్తంగా వుంచుకొనటం అలవర్చుకోవాలి. మీ సాధనలో భాగంగా వ్యక్తమయ్యే అనుభవాలను, స్థితులను బయటకు వెల్లడించకూడదు. మీ ప్రయత్నం లేకుండా అప్రయత్నంగా బయటకు వ్యక్తమయ్యే సందర్భాలు వుంటాయి. అలా జరిగినప్పుడు వాటిని గురించి చింతించవలసిన అవసరం లేదు. ఆయా అనుభవాలను మీ సాధన ముందుకు సాగుతుందని గీటురాళ్లుగా భావించకూడదు. అలా భావించినట్లయితే మీ సాధనకు ఎంతటి నష్టం కలుగుతుందో మీకు తెలియదు. కనుక ఎల్లప్పుడూ మీరు మీ లక్ష్యసాధన వైపే అప్రమత్తులై ముందుకు సాగాలి, కానీ మీకు సంభవించే దివ్యానుభవాలను గురించి ఏమాత్రం పట్టించుకొనకూడదు. వాటిని బయటకు వ్యక్తపరచకూడదు.

అమ్మ యిలా అనేవారు: "అప్రయత్నంగా దివ్యానుభవాలు ప్రకటమవటం అనేది సాధనలో ఒక స్థితిని సూచిస్తుంది. అయితే మీరు ఆ విషయాలపై ఏమాత్రం దృష్టిని పోనివ్వకూడదు. కీర్తికాంక్షతో నీ స్థితిని నీవు బయట పెట్టుకున్నట్లయితే అంతటితో నీ పురోగమనం ఆగిపోతుంది. ఈ వింతలను, విచిత్రాలను లక్ష్యపెట్టక ముందుకు సాగాలి. మరొక మజిలీ వచ్చేసరికి లోగడ నీ ప్రయత్నం లేకుండా కలిగే వింత అనుభవాలు ఆగిపోవడం జరుగుతుంది."

శ్రీ ఆనందమయి అమ్మ ఢాకా విడిచి పర్యటనలు చేసే సమయంలో జ్యోతిష్ దాదా, నిరంజన్ బాబు వంటి భక్తులంతా అమ్మకు ఒక ఆశ్రమం నిర్మించాలని సంకల్పించారు ఆ విషయం అమ్మతో ప్రస్తావించగా అమ్మ "నాకు ఆశ్రమం యొక్క ఆవశ్యకత ఏమీ లేదు. చెట్టు నీడైనా, ఆశ్రమం అయినా ఒకటే. మీకు కావాలనుకుంటే కట్టించుకోవచ్చు. అయితే మీరు ఎలాంటి నిర్మాణం చేయాలన్నా కాళికాలయం వెనక ఉన్న ప్రదేశంలోనే నిర్మించండి" అన్నారు. మరొక సందర్భంలో ఆ ప్రదేశం యొక్క విశిష్టతను శ్రీ ఆనందమయి మాత యిలా వివరించారు. ఈ ప్రదేశం అత్యంత శక్తివంతమైన పుణ్యస్థలం. పూర్వం ఇక్కడ ఎందరో మహాత్ములు నివసించారు. ఎందరో సన్యాసులు, సాధకులు కేవలం పండ్లు మాత్రమే ఆహారంగా తీసుకుంటూ, మరికొందరు సాధకులు నిరాహారులై కూడా అనేక సంవత్సరాలు కఠిన సాధనలు చేశారు. వారందరికీ ఇక్కడి కాళికాలయంలోని కాళీమాత దర్శనమిస్తుంది. అలాంటి వారందరినీ ఆ దేవి కంటికి రెప్పలాగా కాపాడుతుంది. ఈ విధంగా ఆ ప్రదేశం యొక్క విశిష్టతను వివరించి

చెప్పటంతో జ్యోతిష్ దాదా, నిరంజన్ బాబు వంటి భక్తులందరూ అమ్మ అనుగ్రహంతో ఆ స్థలాన్ని కొనుగోలు చేసి ఆశ్రమ నిర్మాణం చేయడం జరిగింది.

ఢాకాలో ముసల్మాన్ నవాబులకు చెందిన తోటయే షాహ్-బాగ్ తోట. ఆ తోట లోనే భోలానాథ్ గారు 1924లో, వైశాఖ శుద్ధచవితి నాడు వ్యవస్థాపకులుగా నియుక్తులైనారు. ఆ తోటలోనే ఆయనకు నివాస గృహం కూడా కేటాయించటం జరిగింది. ఆ తోట యజమానురాలు బేగం ప్యారీబాను. అమ్మ తోటలో నివాసం వుంటున్న ప్రారంభ రోజుల్లో అమ్మ దివ్యత్వం గురించి ఎవ్వరికీ తెలియదు. ఆ సందర్భంలో అమ్మను ఒక సాధారణ భక్తిరాలిగా భావించి తోటలో భజనలు, పూజలు జరిగే సమయాలలో భక్తులు పెద్ద సంఖ్యలో అక్కడకు రావటం ప్యారీబాను కుటుంబ సభ్యులకు నచ్చకపోవటంతో మొదట్లో తోటలో అటువంటి కార్యక్రమాలు నిషేధించారు. కాలాంతరములో అమ్మ ఎంతటి గొప్ప మహాత్మురాలో గ్రహించిన ఆ నవాబుల కుటుంబం అమ్మకు గొప్ప భక్తులై లోగడ తాము తోటలో పూజలను నిషేధించినందుకు సిగ్గుపడి, పశ్చాత్తాపంతో అమ్మను క్షమాపణ వేడారు.

ప్యారీబాను కుటుంబం కలకత్తాలో వుండేది. అమ్మ తన పర్యటనలలో కలకత్తా వచ్చిన ప్రతిసారి ప్యారీబాను అమ్మను తన గృహానికి ఆహ్వానించేది. సగౌరవంగా అమ్మను, అమ్మ భక్తులను తన ఇంట్లో విందు భోజనాలతో సత్కరించేది. అమ్మను పూజిస్తూ సంకీర్తనలు, భజనలు ఎంతో భక్తిశ్రద్ధలతో జరిపించేది.

ప్యారీబానుకు ఒక కుమార్తె, ఒక కుమారుడు వున్నారు. 1927వ సంవత్సరంలో ఆ పిల్లలిద్దరికీ వివాహాలు జరిగాయి ఆ సందర్భంగా ప్యారీబాను శ్రీ ఆనందమయి మాతను తమ గృహానికి ఆహ్వానించింది. శ్రీ భోలానాథ్ గారు, అమ్మ కొందరు భక్తులతో ఆ వివాహాలకి హాజరైనారు. ఒకేరోజు రెండు వివాహాలు వేరువేరు గృహాలలో జరిగాయి. అమ్మ రెండుచోట్లకు వెళ్ళి వధూవరులను ఆశీర్వదించారు. కల్యాణాలు జరుగుతున్న సమయాలలో ప్యారీబాను అమ్మను, శ్రీ భోలానాథ్ గారిని వివాహవేదికపై ఆసీనులను చేసి అమ్మ సమక్షంలోనే వివాహ క్రతువు జరిపించారు. ఎంతో భక్తిశ్రద్ధలతో వధూవరులు అమ్మకు నమస్కరించుకుని పూజించి కళ్యాణ మండపాలలో ప్రవేశించారు. ఆ కళ్యాణాలు అమ్మ ఆశీస్సులతో నిర్విఘ్నంగా జరిగిపోయాయి.

- సశేషం

మరికొందరు భక్తులు

03వ పేజీ తరువాయి

వృద్ధిపొంది దానివలన భక్తి, ధ్యానమూ గూడ వృద్ధి పొందుతాయి" అన్నారు. ఆ మాటలు విని ఆయన అడుగకనే థక్కర్ గూడ ఆయన చేతిలో ₹15/-లు వుంచాడు. నిజానికతడు ఆయనకు దక్షిణ సమర్పించగూడదని మొదట అనుకున్నాడు.

కాకా మహాజని మిత్రులలో ఒకరు విగ్రహారాధన, వ్యక్తిపూజలను నమ్మేవాడుగాదు. ఒకసారతడు కేవలం కుతూహలంవలన, రెండు షరతుల పై మాత్రమే కాకా మహాజనితో కలసి శిరిడీ రావడానికి అంగీకరించాడు. 1) తాను బాబాకు నమస్కరించననీ, 2) ఆయనకెట్టి దక్షిణ సమర్పించననీ. తర్వాత ఆ ఇద్దరూ శిరిడీ చేరి, మశీదు ప్రవేశించగానే బాబా అతనికేసి చూసి, ఎంతో మృదువైన స్వరంతో 'ఓహో, తమరొచ్చారే!" అన్నారు. ఆయన కంఠధ్వని సరిగ్గా అతని తండ్రి గొంతులా వున్నది. అది వింటూనే అతడు పులకించిపోయి, పొంగిపొరలే భావోద్రేకంతో, 'అరే సరిగ్గా మా నాయనగారి గొంతే!' అని ముందుకు దూసుకుపోయి, బాబా పాదాలకు నమస్కరించాడు. సాయి అదేమీ పట్టించుకొనక, కాకా మహాజనివైపు మాత్రమే చేయిజాపి దక్షిణ కోరారు. అతని మిత్రుడు ఖిన్నుడై "బాబా, నన్ను దక్షిణడుగరేమి?" అన్నాడు. సాయి, "దక్షిణ సమర్పించడం నీకిష్టం లేదు గనుక నిన్నడగడం జరుగదు. అయినా నీవు యివ్వాలనుకుంటే ఇప్పుడైనా సమర్పించవచ్చు" అన్నారు. అప్పుడతడు గూడ దక్షిణ సమర్పించాడు. బాబా అతనితో, "మనలను వేరుచేసే అడ్డుగోడను తొలగించు, దానిని నశింపజేయి. అపుడు ఒకరినొకరము చూడగలుగుతాము. ప్రత్యక్షంగా కలుసుకుంటాము" అన్నారు.

- సశేషం

(గత సంచిక తరువాయి)

ఆశాజ్యోతి

శ్రీ వాసుదేవరావు

(మాస్టరుగారి పరిచయ భాగ్యాన్ని పొందిన పిమ్మట అప్పటి వరకు తాను చేసిన బాబా పూజా విధానం ఎంత యాంత్రికమో అర్థమయి, వారి ప్రబోధాన్ని అందుకుని సాయినాథుని అనన్య భక్తితో కొలిచేందుకు మార్గదర్శకులైన మాస్టరుగారిని, బాబా గారిని రెండు చక్షువులుగా భావించి సాయి మాస్టర్ సన్నిధిలో తను పొందిన అనుభూతులను అందించుచున్నారు.)

మాస్టారుగారు ఒకసారి "బాబా తత్వ ప్రచారం చేయడానికి నాకు ఎక్కువ సమయం లేదు. నేను ఇంటి దగ్గరే కూర్చుని చూస్కునే కార్యక్రమం చాలా వుంది. అందువలన మీరంతా కూడా ప్రచార బాధ్యత స్వీకరించాలి" అని అన్నారు. అనటమే కాదు, అందుకు మమ్మల్నందరినీ సాయి తత్వ ప్రచారంలో నిష్ణాతుల్ని చేయాలనేటటువంటి దృఢ సంకల్పంతో క్లాసెస్ పెట్టేవారు. మేము ఏదో ఒక టాపిక్ గాని లేక బాబా గురించిన ఒక టాపిక్ గాని లేక అంశంపైన గాని ప్రిపేర్ అయి వచ్చి ఆ క్లాస్ లో అందరి ముందు చెప్పాలి. అలా మాకు వున్న సభా పిరికితనం, సంకోచము, సిగ్గు పడటం లాంటి మనోవికారాలని పోగొట్టాలని ప్రయత్నించేవారు. ఎలా చెప్పాలో చెప్పి మా తప్పుల్ని సరిదిద్దేవారు. అలా మమ్మల్ని ఎంతగానో ప్రోత్సహించేవారు. అలా చాలా మందిలో నున్న మానసిక వత్తిడులను పోగొట్టి, అంతర్గతంగా వున్న వాక్పటిమను, రచనా వ్యాసంగాన్ని మేల్కొలిపి సమాజానికి వుపయోగపడే వ్యక్తులుగా తీర్చిదిద్దారు.

నాకు తెలిసిన వారు కొంత మంది గురువుల దగ్గర ఉపదేశం పొందారు. వారు నన్ను 'ఉపదేశం తీస్కోండి' అని చెప్పినప్పటికి మాస్టారుగారు చెప్పినట్లుగా బాబానే నా గురువుగా ఎంచుకున్నాను. ఇంత వరకు నా విశ్వాసం ఏ విధంగానూ సడలలేదు. ఎన్నో ఏళ్ళ నుండి బాబాను పూజిస్తున్నప్పటికి నిజమైన ఆధ్యాత్మికత ఏమిటో బోధ పరచేటందుకే, నాపూజలోని యాంత్రికతను తీసివేసేటందుకే నన్ను మాస్టార్ గారి దగ్గరకు చేర్చినారని అనిపిస్తుంది. మాస్టార్ గారు ఒంగోలు రాని పక్షంలో, వారి దర్శన భాగ్యం కల్గని పక్షంలో, వారితో సన్నిహిత సంబంధం కల్గని పక్షంలో, అసలు బాబా అంటే ఏమిటో ఆయన నిజతత్వమేమిటో తెల్సుకునే భాగ్యం ఈ జీవితంలో కల్గేది కాదేమోనని ఇప్పటికీ అనిపిస్తూంటుంది. అందువలన నా జీవితంలో సక్రమమైనటువంటి ఆధ్యాత్మిక చింతన కల్గించి నాకొక వ్యక్తిత్వాన్నిచ్చిన భరద్వాజ మాస్టార్ గారు మరియు సాయినాథుడు ఇద్దరూ నాకు పూజనీయులే. సదా వారికి నేను ఋణగ్రస్తుడనే.

ఒకరోజు నేను మాస్టారుగారి దగ్గరకెళ్ళాను. కుశల ప్రశ్నల అనంతరం ఎక్కడికెళ్ళారని అడిగారాయన. "ఆఫీస్ పని మీద వేరే వూరెళ్ళాను" అని చెప్పాను. "అక్కడ బాబా గురించి చెప్పారా?" అని అడిగారు. ఎక్కడికన్నా వెళ్ళినప్పుడు బాబా గురించి చెప్పమనేవారు. అలాగే చెప్పేవాణ్ణి. "బాబా విశ్వరూపం గురించి చెప్పాను మాస్టార్ గారు" అని అన్నాను. ఆయన ఎంతో ఆనందించారు. ఆనందంలో ఆయన కళ్ళు విప్పారినాయి. "ఎలా చెప్పారో నాక్కూడా చెప్పాలి" అన్నారు. నేను చెప్పడానికి ప్రారంభించబోతే, "ఇప్పుడు కాదు ఇక కొద్ది రోజుల్లో శ్రీరామనవమి వస్తున్నది కదా, అప్పుడు మందిరంలో చెప్పాలి" అన్నారు. అలానే కరపత్రాలు కూడా వేయించారు. రోజులు ఆనందంగా దొర్లిపోతున్నాయి. అక్కల్కోట స్వామి వారి పాదుకలు వచ్చాయి. ఎంతో మంది మహనీయులు ఏదో ఒక రూపంగా మందిరానికి వస్తున్నారని ఆనందించాము.

- సశేషం

ద్వారకామాయి అనుభవమండపము

శ్రీమతి జయప్రద, గుంటూరు

మొట్టమొదటిసారి 1984లో పూజ్యశ్రీ మాస్టరుగారితో శిరిడి యాత్రకి వెళ్ళాము. అది ఆ యాత్రకి వచ్చిన వాళ్ళందరి ఎన్నోజన్మల పుణ్యఫలం. ఎందుకంటే ఎన్నో విషయాలు పూజ్యశ్రీ మాస్టరుగారు మాకు దగ్గరుండి వివరించారు. శిరిడీలో ప్రతి అణువు దగ్గరుండి చూపించారు. అప్పట్లో ఇంత రద్దీ వుండేదికాదు. కనుక మాకు శ్రీ సాయినాథుని తాకి నమస్కరించుకునే అవకాశం కలిగింది. ఆ యాత్రలో పూజ్యశ్రీ మాస్టరుగారు అక్కడ వున్నన్ని రోజులూ అన్ని హారతులు మానకుండా చేసుకొమ్మని చెప్పారు. కొంచెం విరామ సమయముంటే బాబా గురించి, శ్రీ సాయిలీలామృతములో సంఘటనల గురించి చెప్పేవారు. అప్పుడు మాకు బాబా తత్త్వం బాగా అర్థం అయ్యింది.

పూజ్యశ్రీ మాస్టరుగారు సమాధి అయ్యాక ఒకసారి శిరిడి వెళ్ళాము. పూజ్యశ్రీ మాస్టరుగారు చెప్పినట్లు అన్ని హారతులకు హాజరయ్యేవాళ్ళం. ఒకరోజు సాయంత్రం సంధ్య హారతికి హాజరైనప్పుడు నాకు పూజ్యశ్రీ మాస్టరుగారు బాగా గుర్తుకొచ్చారు. హారతి జరుగుతూనే వుంది, నేను బాబాతో, ''మా మాస్టరుగారిని అంత తొందరగా ఎందుకు తీసుకెళ్ళారు? ఇంకా వుంటే మీ గురించి ఎంతమందికో చెప్పేవారు కదా, మా అందరికి పెద్దదిక్కుని తీసుకెళ్ళిపోయావు" అని అడుగుతూ బాగా ఏడుస్తున్నాను. హారతి అయిపోయింది. మావాళ్ళందరూ ఎందుకలా వున్నావని అడిగారు. పూజ్యశ్రీ మాస్టరుగారు గుర్తుకొచ్చారని చెప్పాను. తరవాత మళ్ళీ రాత్రి శేజ్ హారతికి వెళ్లాను. అప్పుడు హారతి పాడుతూ బాబా వైపు చూస్తుంటే, ఆయన చిన్న పిల్లవాడు నవ్వినట్లు కిలకిలా నవ్వుతున్నారు. అదిచూసి నాకూ నవ్వొచ్చింది. ఆయన నవ్వటం నేను నవ్వటం హారతి అంతా ఇలాగే కొనసాగింది. బైటకి వచ్చాక అనుకున్నాను, "బాబా సాయంత్రం హారతిలో నేను బాగా యేడ్చినందుకు, ఇప్పుడు నన్ను నవ్వించి పంపించావా" అని నమస్కరించుకున్నాను.

కోవిడ్ వచ్చే ముందు సంవత్సరం శిరిడీకి వెళ్ళినప్పుడు ద్వారకామాయిలో రాత్రి సేవ చేసుకునే అవకాశం వచ్చింది. రాత్రి 11 గంటలకి ద్వారకామాయికి వచ్చాము. రెండుగంటల సమయానికి శిరిడీలో వుండేవాళ్ళు వచ్చి అక్కడుండే వాళ్ళందరికి సేవ చేసుకునే అవకాశం ఇచ్చారు. అంతా శుభ్రం చేసాక ధుని తెరిచి దానిని సరిచేసి మళ్ళీ మూసేస్తారు. అది మనం చూడొచ్చు. చివరిగా 5 కొబ్బరికాయలు ఐదుగురికి ప్రసాదంగా ఇచ్చి దానిని పూజలో పెట్టుకొమ్మని చెప్పారు. బాబా దయవల్ల నాకు కూడ ఒక కాయ ప్రసాదంగా దొరికింది. ఆ కొబ్బరికాయని మా ఇంట్లో పూజలో పెట్టుకున్నాను.

ఒకసారి దర్శనానికి వెళ్లినప్పుడు అక్కడున్న సెక్యూరిటీ వాళ్ళు అందరిని నెట్టేస్తున్నారు. నాకు చాలా బాధవేసి, మన అస్త్రం వుందికదా దానిని బైటికి తీసాను. అంటే.... 'ఓం సాయినాథ జై, గురు భరద్వాజ జై!' అని నామం చెప్పుకుంటున్నాను. అంతే, చిత్రంగా అందరిని నా పక్కనించి పంపించేస్తున్నారు కానీ నన్ను మాత్రం పంపించలేదు. నా పక్కనే లేడీ పోలీస్ కూడా వుంది, అయినాకానీ నా జోలికి రాలేదు. నాతో వచ్చినవాళ్ళందరూ బైటికి వెళ్ళిపోయి నా కోసం ఎదురు చూస్తున్నారు. నేను తృప్తిగా దర్శనం

చేసుకున్నాక బైటికి వచ్చాను.

కరోనా తగ్గి దర్శనాలు మొదలయ్యాక మేము కొంతమందిమి కలిసి శిరిడి దర్శనానికి వచ్చాము. అందులో మొదటిసారి వచ్చిన ఒకమ్మాయి వుంది. తను "నేను మీతోనే ఉంటానండి, నాకు అన్నీ చూపించండి" అని నాతోనే ఉండేది. ఒకరోజు ఉదయమే, నిద్ర లేవగానే, 'ఎవరో, రాత్రి 10 గంటల హారతి తరవాత బాబా ప్రసాదం 'కేసరి' నాకు ఇస్తున్నట్లు భావన వచ్చింది. అది పదే పదే అనిపించసాగింది. ఆ విషయం నాతో వచ్చిన ఆ అమ్మాయితో చెప్పాను. అప్పుడు "నేను కూడా మీతో వున్నానా అండీ" అనడిగింది. "ఏమో అప్పుడు నా పక్కన ఎవరూ కనిపించ లేదు" అని చెప్పాను. అయితే నేను మీతోనే వుంటాను కనక అది నిజమవుతుందో లేదో చూద్దాం అంది. ఆ రోజు మేము నాసిక్ చూడటానికి వెళ్ళాము. తిరిగి వచ్చేసరికి రాత్రి 10 అయ్యింది. శేజ్ హారతికి లోపలికి వెళ్లే సమయం అయిపోవడం వల్ల బయట గురుస్థానం ఎదురుగా వున్న స్థలంలో కూర్చుని హారతి పాడుకున్నాము.. హారతి పూర్తయ్యాక గురుస్థానం దగ్గర ప్రసాదం పంచుతున్నారు. మేము కూడా వరుసలో నిలుచున్నాము. నాతోపాటు వున్న అమ్మాయికి బాత్రూం కి వెళ్ళవలసి వచ్చింది. నేను అక్కడ దగ్గరలోనే టాయిలెట్స్ ఉన్నాయని చూపించాను. కానీ తను మళ్ళీ వచ్చేసరికి ప్రసాదం అయిపోతుందని కొంతమందిని అడిగి, ముందుకి వెళ్ళి ప్రసాదం తీసుకుని, నేను వచ్చేవరకు ఇక్కడే వుండండి అనిచెప్పి, వెళ్ళింది. మేము లైన్ లో వెళ్లి ప్రసాదం తీసుకుని దీక్షిత్ వాడా వైపు నడుస్తున్నాము.. నేను ఇంకొక రెండడుగులు ముందుకి వున్నాను.

ఇంతలో పెద్ద బొట్టుపెట్టుకుని పచ్చగా వున్న ఒకావిడ వచ్చి, చేతిలో వున్న డబ్బాలో ప్రసాదం నాకు చూపిస్తూ "ఇది నిజ సమాధి ప్రసాదం అండీ, మీకు కావాలా" అని అడుగుతున్నారు, "అయ్యో కావాలా, ఏంటండీ, తప్పకుండా ఇవ్వండి" అన్నాను. ఆవిడ వేడి వేడి ప్రసాదం నాకు ఇచ్చారు. నాతోపాటు వచ్చిన వాళ్లకి కూడా ఈ విషయం చెబుతుండగానే ఆవిడ వెనక్కి తిరిగి వెళ్ళిపోయారు. మా వాళ్ళు గబగబా వెళ్లినా ఆవిడ కనిపించలేదు. నాకు అంతవరకు నిజసమాధికి ప్రసాదం పెడతారని తెలియదు. తరవాత కనుక్కుంటే రోజూ ప్రసాదం పెడతారని తెలిసింది. నిజ సమాధి బాబా విగ్రహానికి కింద ఉంటుంది. అక్కడి ప్రసాదం నాకు లభించడం సాయినాథుని కృప. నాకు ఉదయం నించి అనిపించిన భావన నిజమయ్యేసరికి చాలా ఆశ్చర్యం వేసింది. నాతో పాటు ఉన్న అమ్మాయి సరైన సమయానికి తను లేనందుకు చాలా బాధపడింది. తరువాత ఆ ప్రసాదం అందరం తీసుకున్నాము.

మా నాన్నగారు పక్కా కమ్యూనిస్ట్. ఏ దేవుడిని నమ్మేవారు కాదు. అలాంటి ఆయన - మా అక్కచెల్లెళ్ళందరము బలవంతం చేస్తే - పూజ్యశ్రీ మాస్టరుగారితో శిరిడి యాత్రకి వచ్చారు. అప్పుడు పూజ్యశ్రీ మాస్టరుగారు చెప్పిన సత్సంగాలు విని నాన్న సాయి భక్తులైపోయారు. నిరంతరమూ బాబా నామస్మరణ చేస్తుండేవారు. ఒకసారి ములక్కాడలు కోయడానికి ములగ చెట్టు ఎక్కారు. బాగా పైకి ఎక్కారు, ములగచెట్టు అసలే సున్నితంగా ఉంటుంది కదా పై కొమ్మ విరిగి బాగా ఎత్తునించి కింద పడిపోయారు. అలా పడిపోయినప్పుడు బాబా అని గట్టిగా అరిచారట. చుట్టుపక్కల అందరూ పరిగెత్తుకొచ్చి, "పెద్దాయనా! నువ్వెందుకు ఆ చెట్టెక్కావ్, ఏ కాలో చెయ్యో విరిగితే ఎంత కష్టం" అంటుంటే, మా నాన్న మామూలుగా లేచి "నాకేమీ కాలేదు, నన్ను బాబా కాపాడారు" అని చెప్పారట. ఈ లీల అప్పట్లో పూజ్యశ్రీ మాస్టరుగారికి చెప్తే, నాకు ఉత్తరము రాస్తూ 'ద్వారకామాయి అనుభవ మండపము' లో వేద్దాము, మీ అక్కయ్యని రాసి పంపించమని చెప్పు అని, బ్రాకెట్స్ లో పాలిటెక్నిక్ అని రాశారు (నాకు ముగ్గురు అక్కలు, ఈ అక్క పాలిటెక్నిక్ కళాశాలలో అధ్యాపకురాలిగా పని చేస్తోంది). ఈ ఉత్తరం 'ఆచార్య అమృత లేఖావళి' గ్రంథంలో ఉంటుంది. కానీ మా అక్క రాయలేదు, నేనూ రాయలేదు. ఇప్పటికి ఆ విషయం తలచు కుంటే బాధగా ఉంటుంది. మళ్ళీ ఇన్ని సంవత్సరాలకి బాబా లీలలు పంచుకునే అవకాశం వచ్చింది కనుక నా అనుభవాలతో పాటు ఇప్పుడు మా నాన్నగారి అనుభవము కూడా చెప్పాను. ఆయనకు ఇంకా చాలా అనుభవాలు జరిగాయి. ఆయన చివరి శ్వాస వరకు బాబా మీద విశ్వాసంతో వున్నారు.

ఇలా మా కుటుంబాన్నంతటిని తన దరి చేర్చుకుని, మాకు పూజ్యశ్రీ మాస్టరుగారిని పరిచయం చేసి చక్కటి మార్గనిర్దేశనం చేసిన సమర్థ సద్గురు శిరిడీ సాయినాథునికి వందన సహస్రాలు. ●

ఆచార్యుని అద్భుత లీలలు

శ్రీ రామకృష్ణశర్మ, పొదిలి

పొదిలి వాస్తవ్యులు రామకృష్ణశర్మగారు పూజ్యశ్రీ భరద్వాజ మాస్టరుగారితో వారి స్మృతులను, అనుభవాలను ఈ విధంగా తెలియచేస్తున్నారు..

మా సొంత ఊరు మార్కాపురం. నా చదువు పూర్తయ్యాక అక్కడే ఒక కాన్వెంటులో ఉద్యోగానికి చేరాను. అక్కడ ఒక సోదరి పరిచయమై శిరిడీసాయి భక్తురాలైన తన పెద్దమ్మగారిని నాకు పరిచయం చేసింది. ఆమె నాకు సాయిసచ్చరిత్ర గ్రంథం ఇచ్చారు. నేను ఒక్కసారి పారాయణ చేయగానే నాకు రాష్ట్ర ప్రభుత్వంలో తాలూకా కార్యాలయం (M R O) లో ఉద్యోగం వచ్చింది. అది నాకు జరిగిన మొట్టమొదటి బాబా లీల. నేను APPSC పరీక్షలు 1981లో ఉత్తీర్ణుడయ్యాను. అప్పటినుంచి ఉద్యోగ ప్రయత్నాలు చేస్తున్నాను. నేను 1984లో సచ్చరిత్ర చదివాను. అప్పుడే నాకు ఉద్యోగం వచ్చింది. అందుకే అది నాకు బాబా చేసిన లీల!

నన్ను మొట్టమొదట ఒంగోలు కార్యాలయంలో వేశారు. నేను పూజ్యశ్రీ మాస్టరుగారుండే ఇంటికి ముందువీధిలో వుండేవాడిని. పూజ్యశ్రీ మాస్టరుగారు బాబా గురించి బాగా చెప్తారని ఎవరో అంటే, ఒకరోజు పూజ్యశ్రీ మాస్టరుగారి ఇంటికి వెళ్లాను. అప్పుడు పూజ్యశ్రీ మాస్టరుగారు జె. వి. సుబ్బయ్యగారి ఇంట్లో వుండేవారు. నేను వెళ్లేసరికి సిగరెట్ త్రాగుతూ, మాట్లాడుతూ, అందరికీ ఊదీ ఇస్తున్నారు. నేను ఊహించుకున్నదానికి వ్యతిరేకంగా వుండటంతో లోపలకి వెళ్లి ఊదీ తీసుకోకుండా బయటనుంచే వచ్చేశాను. మళ్ళీ తరవాతి గురువారం ఎందుకో వెళ్లాలనిపించింది. ఈసారి నాలో ఏ భావమూ లేదు. వారినుంచి ఊదీ, తీర్థము తీసుకుని వచ్చేశాను. మళ్ళీ ఇంకొకసారి వెళ్లేసరికి పూజ్యశ్రీ మాస్టరుగారు ఒక్కరే వున్నారు. చాలా ప్రేమగా నా వివరాలన్నీ అడిగారు. చెప్పాను. అప్పుడు పత్రికకి చందా కట్టమని నాతో ఒక మాట చెప్పారు. “గుళ్లో దక్షిణ వేయడం కన్నా ఆ డబ్బులతో గ్రంథాలు పంచడం చాలా ఉత్తమం. ఎందుకంటే ఆ దక్షిణతో బాబా గ్రంథం ఎవరికైనా యిస్తే ఆ గ్రంథం రూపంలో బాబా వారి ఇంట్లో వున్నట్లు. దానివల్ల వారికి ఎంతో మేలు జరుగుతుంది” అని చెప్పారు. అప్పటినుంచి మేము అదే సేవగా పెట్టుకున్నాము. నాకు బాబా జీవిత చరిత్ర మొదటి ముద్రణ యిచ్చారు. వారి దగ్గర ఖురాన్, బైబిల్ లాంటి గ్రంథాలుండేవి. “అవన్నీ ఎందుకు మాస్టారూ?” అని అడిగితే, “ఏం లేదయ్యా! అన్ని మతాల్లో కూడా ‘గురువే చాలా గొప్పవారు’ అని వుందని చెబుతారు. అది తెలుసుకోవడానికి చదువుతున్నాను” అన్నారు.

తరవాత నన్ను కొత్తపట్నం బదిలీ చేశారు. అక్కడనుంచి కూడా పూజ్యశ్రీ మాస్టరుగారి దర్శనానికి వస్తుండేవాడిని. మావాళ్ళు నాకు పెళ్లి సంబంధాలు చూడటం మొదలుపెట్టారు. ఒక సంబంధం నాకు, ఇంట్లోవాళ్ళకి నచ్చింది. కానీ తరవాత మా కుటుంబంలో వచ్చిన సమస్యలవల్ల ఆ సంబంధం కుదరలేదు. నాకు చాలా బాధ కలిగింది. అలాగే పూజ్యశ్రీ మాస్టరుగారి దగ్గరికి వెళ్లాను. విషయమంతా వివరించాను. అప్పుడు పూజ్యశ్రీ మాస్టరుగారు సాయిబాబా పటం ముందు రెండు చీటీలు వేసి ఒక చీటీ తీసి, “నీకు అంజనీ కుమారి అని పేరున్న అమ్మాయితో వివాహం అవుతుంది!” అన్నారు. వెంటనే నేను

తుళ్ళిపడి, "మాస్టారూ! ఇప్పుడు వద్దనుకున్న సంబంధంవాళ్ళ అమ్మాయి పేరు అంజనీకుమారేనండి!" అన్నాను. దానికి పూజ్యశ్రీ మాస్టరుగారు, "నాకేమీ తెలియదు. బాబా అలా చెప్పమన్నారు!" అన్నారు. 1986 లో నాకు వేరే అమ్మాయితో వివాహమైంది. నా భార్య పేరు కూడా 'అంజనీ కుమారి'!! పూజ్యశ్రీ మాస్టరుగారి మాట పొల్లుపోకుండా అదే పేరున్న అమ్మాయితో వివాహమైంది. పెళ్లయ్యాక పూజ్యశ్రీ మాస్టరుగారి దర్శనం చేసుకుని, ఆశీస్సులు తీసుకున్నాము. తరవాత నేను మా స్వంత ఊరైన మార్కాపురానికి బదిలీ చేయించుకుని వెళ్ళిపోయాను. దానితో పూజ్యశ్రీ మాస్టరుగారికి దూరమైపోయాను.

ఒకసారి పూజ్యశ్రీ మాస్టరుగారు విజయవాడ ముత్యాలంపాడు బాబా మందిరానికి వచ్చినపుడు నేనూ వెళ్లాను. ఆయన సత్సంగం చేస్తున్నారు. నేను దూరంగా నిల్చొని చూస్తున్నాను. అప్పటికి నేను వారిని కలిసి దాదాపు రెండు సంవత్సరముల పైనే గడిచింది. నన్ను గుర్తుపట్టరేమో అనుకున్నాను. అంత దూరం నుంచి నన్ను రమ్మని పిలిచారు. నేను దగ్గరకు వెళ్లి ఏమీ మాట్లాడకముందే పూజ్యశ్రీ మాస్టరుగారు, "ఎప్పుడొచ్చావు? ఎక్కడ వుంటున్నావ్? ఏమైనా ఇబ్బందిగా వుంటే సామాను తీసుకుని నా దగ్గరకి వచ్చేయ్!" అంటూ ప్రేమగా అడిగారు. నా కళ్లు చెమర్చాయి. అప్పుడే కాదు ఇప్పుడు కూడా నా కళ్ళు చెమరుస్తున్నాయి. గడచిపోయిన రోజులు గుర్తుతెచ్చుకుంటే, 'అప్పట్లో నేను వారికి దూరమవ్వకుండా వుంటే ఆయననుంచి ఎంత ఆధ్యాత్మిక సంపద పొంది వుండేవాడినో కదా!' అనిపిస్తుంది.

నాకు పూజ్యశ్రీ మాస్టరుగారు సంహితాయన ద్విసాహస్రి గ్రంథం మీద, "దత్తానుగ్రహ ప్రాప్తిరస్తు!" అని సంతకం చేసి యిచ్చారు.

నాకు బాబా అంటే చాలా ఇష్టం. మా ఇంట్లో బాబా రకరకాల భంగిమలలో, రూపాలలో వున్న చిత్రపటాలు దాదాపు 28 వరకూ వున్నాయి. దత్తస్వామి అంటే అంతగా భావముండేది కాదు. ఏదో ఒకటి రెండుసార్లు పారాయణ చేశాను. ఊరుకున్నాను. తరవాత ఒక చిత్రమైన సంఘటన జరిగింది.

మా అమ్మగారి సంవత్సరీకాల తరువాత సత్యనారాయణ వ్రతం చేసుకోవాలనుకున్నాము. దానికి మా అన్నకొడుకుని కూడా రమ్మన్నాను. వాడు, "దత్త జయంతి రాబోతోంది కనుక నాకు గుళ్లో అభిషేకాలుంటాయి, రాలేను!" అన్నాడు. నేను వెంటనే ఆవేశంగా, "దత్తస్వామి గొప్పా, సత్యనారాయణస్వామి గొప్పా?" అన్నాను. ఇలా అన్న వెంటనే మడిబట్టలు తేవటానికి మేడమీదకి వెళ్లాను. అక్కడ మూడు కోతులు నా వెంట పడ్డాయి. వాటిని తప్పించుకోవడంలో నేను క్రింద పడ్డాను. కుడిచెయ్యి విరిగిపోయింది. ఆఫీసుకి వెళితే, వ్రాయవలసిన చెయ్యి విరిగిపోతే కార్యాలయానికి వచ్చి ఏం చేయగలవు? సెలవు పెట్టమన్నారు. అప్పుడు వెంకయ్యస్వామి చరిత్ర చదివాను. గొలగమూడి వెళ్లాను. బాబా చరిత్ర చదివాను. శిరిడీ వెళ్లాను. గురుచరిత్ర చదివాను. గాణ్గాపురం వెళ్లాను. ఇక అక్కడనుంచి నాకు దత్తస్వామిమీద మనస్సు తిరిగిపోయి, దాదాపు 35సార్లు గాణ్గాపురం వెళ్లి వుంటాను. పూజ్యశ్రీ మాస్టరుగారు వ్రాసిన 'దత్తానుగ్రహ ప్రాప్తిరస్తు!' అనే ఆశీస్సులకు అంత బలముందని అర్థమైంది!

నా శ్రీమతిని బాబా, పూజ్యశ్రీ మాస్టరుగారు సూచించినందుకు ఆమె కూడా పారాయణ చేసుకోవడం, మహాత్ముల దర్శనం చేసుకోవడం, యివన్నీ చేస్తుంది. అంతేకాదు. పూజ్యశ్రీ మాస్టరుగారిని విష్ణుమూర్తిగా భావించి వారి అష్టోత్తరం, పూజ్యశ్రీ అమ్మగారిని లక్ష్మీదేవిగా భావించి వారి అష్టోత్తరం ప్రతిరోజూ చేసుకుంటుంది. ఇలా వారి ఆశీస్సులతో మా జీవనం నడుస్తోంది.

నేను, పున్నయ్య శాస్త్రిగారు ఒకసారి నాగోలులో పూజ్యశ్రీ అమ్మగారి దర్శనానికి వచ్చాము. అప్పుడు పూజ్యశ్రీ అమ్మగారు వారిని శ్రీ కృష్ణమాచారిగారి గురించి, నన్ను పూజ్యశ్రీ మాస్టరుగారి గురించి చెప్పమన్నారు. పున్నయ్యశాస్త్రిగారు వారి గురువుగారి గురించి చెప్పారు. నేను, "అలా చెప్పడం రాదమ్మా!" అని పూజ్యశ్రీ అమ్మగారితో అంటే, "సరే, పత్రికకి వ్రాసి పంపించండి!" అని చెప్పారు. కానీ ఇప్పటివరకూ నేను ఆ పని చేయలేక పోయాను. దానికి చాలా బాధపడేవాడిని. కానీ ఇప్పుడు పూజ్యశ్రీ అమ్మగారికి యిచ్చినమాట నెరవేరిందని సంతోషపడుతున్నాను.

మా దంపతులిద్దరికీ ఇటువంటి మార్గాన్ని నిర్దేశించి నడిపిస్తున్న గురుదంపతులకు కృతజ్ఞతాపూర్వక నమస్సులు. ●

శ్రీ శిరిడీ సాయిబాబా చేసిన చమత్కారాలు?

05వ పేజీ తరువాయి

సామాజిక వ్యక్తిగత జీవితాలకు అవసరమైన శిక్షణతోపాటు తృప్తి శాంతులకు దోహదం జేసే ఆధ్యాత్మ విద్యను ప్రతివారికీ బోధిస్తే గాని, తిరిగి వారు వారి సంతతికి బోధిస్తుండే సాంప్రదాయం ఏర్పడితేగాని - సమాజంలో ఎవరికీ సుఖశాంతులేగాక నిత్యావసరాలు గూడ అందరికీ సమానంగా లభించే అవకాశం లేదు. అంతేగాదు సమాజంలో అవాంఛనీయమైన అన్ని ధోరణులను గుర్తించి నిగ్రహించడం, నేర్పడం ఎంత అవసరమో ధర్మానికి మూలస్తంభమైన నిజమైన ఆధ్యాత్మ విద్యను ప్రక్కదారి పట్టించే విధానాలను కూడా - యోగచ్యుతుల ధోరణులను గూడ గుర్తించి నిగ్రహించడం ప్రజలకు నేర్పడం విద్యయొక్క ప్రధాన ధర్మం. ఇది సమాజంలో ప్రతి ఒక్కరి కర్తవ్యమున్నూ. మంచి చెడ్డలను గుర్తించి మంచిని ఆశ్రయించడం నేర్పడమేగదా విద్య యొక్క లక్ష్యం?

సజీవ సన్నిధి!!

17వ పేజీ తరువాయి

కోరినా, ఆధ్యాత్మిక మార్గదర్శకత్వం కోరినా మనలను మనం వున్న స్థాయి నుంచి చేయి పట్టి నడిపించి, తప్పటడుగులు, తప్పుటడుగులు వేసే మనకు అవసరమైన శిక్షణనిచ్చి, సంస్కరించి, సన్మార్గంలో ముందుకు నడిపించి, పరుగెత్తించగల, లక్ష్యాన్ని చేర్చగల మాతృదేవి దివ్యసాన్నిధ్యం మనకు లభించింది. ఇక మనం కోరవలసినదేమున్నది?!

పూజ్యశ్రీ అలివేలు మంగమ్మ తల్లి తత్వాన్ని ఇంకా ఇంకా తెలుసుకోవడానికి ప్రయత్నించిన కొద్దీ, మన మనసు వారిని ఇంకా ఇంకా ధ్యానిస్తుంది, స్మరిస్తుంది, మనలో భక్తి ఉదయిస్తుంది, పరిపుష్టమవుతుంది, స్థిరమౌతుంది. అట్టి భక్తి వలన పూజ్యశ్రీ అమ్మగారి అంతులేని దివ్య ప్రేమ మనకు అనుభవమౌతుంది. వారే మనకు ఆత్మబంధువు! వారే మనకు అండాదండా! జన్మజన్మలకు తోడూనీడా! దుఃఖమే లేని ఆనందమే వారు! వారు లేని చోటే లేదు! మనలోనూ, మన వెలుపలా వున్న వారి సన్నిధే వారి స్వస్వరూపం! ఇలా వారి తత్వాన్ని భావన చేస్తూ వారి పవిత్ర సన్నిధానంలో ప్రతిక్షణం గడుపుదాం! మన హృదయాలనే వారి సన్నిధిగా మార్చుకుందాం !!

జై సాయి మాస్టర్

మాతృదేవి స్మృతులు

18వ పేజీ తరువాయి

అమ్మగారికి విన్నవించుకున్నాను. అప్పుడు పూజ్యశ్రీ అమ్మగారు ఆ పాదుకలను ధరించి నాకు ఇచ్చారు. అప్పటినుంచి నేను వాటిని పూజలో పెట్టుకున్నాను. ఈ చర్య ద్వారా పూజ్యశ్రీ మాస్టరుగారికి, పూజ్యశ్రీ అమ్మగారికి భేదం లేదని అర్థమైంది.

1999లో వేదమ్మ పెళ్లికి మాకందరికీ ఆహ్వానాలు వచ్చాయి. మేము పెళ్ళికి వెళ్ళాము. అయితే పెళ్లి సమయం వరకు వుండలేదు. రాత్రి భోజనాలు చేసి బయలుదేరిపోయాము. అయితే వెళ్లిపోయేముందు ఒక్కసారి నాకు పూజ్యశ్రీ అమ్మగారిని కలవాలనిపించింది. అక్కడ వుండేవాళ్ళని అడిగితే పూజ్యశ్రీ అమ్మగారు చాలా బిజీగా వున్నారని చెప్పారు. అయినా ఒక్కసారి నా గురించి చెప్పమన్నాను. అప్పుడు పూజ్యశ్రీ మాస్టరుగారిని బాగా తలచుకున్నాను. వెంటనే పూజ్యశ్రీ అమ్మగారు నన్ను రమ్మని పిలిచారు!! అక్కడ అంతా హడావిడిగా వుంది. పెళ్ళికి కావలసినవి అన్నీ అందరిచేతా పూజ్యశ్రీ అమ్మగారు సర్దిస్తున్నారు. నావైపు తిరిగి, "ఇవి కూడా పెట్టవచ్చునా?" అని అడుగుతూ సర్దిస్తున్నారు. అమ్మకంటే నాకు బాగా తెలుసునని కాదు, నాకు కూడా వేదమ్మ పెళ్లి పనుల్లో భాగం ఇచ్చి ఆ మహాకార్యంలో పాల్గొనే అవకాశం కల్పించాలని!! ఎంత ప్రేమమయులో కదా! అందుకే ఎల్లలు లేనిది వారి ప్రేమ! అటువంటి ప్రేమమూర్తులైన గురుదంపతులకు ప్రేమపూర్వక పాదాభివందనములు!!

ఓం కృపాపూర్ణాయై నమః!

పరమ పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టరుగారిచే రచించబడిన అపూర్వ ఆధ్యాత్మిక వైజ్ఞానిక గ్రంథములు

SRI GURUPADUKA PUBLICATIONS, C/o. SRI MANGA BHARADWAJA TRUST
Regd. Office: Bhakta Nivas, 12-1-170/46P, Hanuman Nagar, Jaipuri Colony, Nagole,
Hyderabad-68. Phone: +91 - 74160 41550
Branch Office : Kondaiah Bunk Street, Kothapeta, Ongole, Prakasam Dist. Andhra Pradesh. Phone: 08592233271
Send DD in favour of "Sri Manga Bharadwaja Trust (Publications)", Payable at Hyderabad or Ongole.

BOOKS CLASSIFICATION

1. BOOKS ON SHRI GURU DATTA

శ్రీ గురుని పై విరచితమైన గ్రంథములు

- శ్రీ గురు చరిత్ర + శ్రీ సాయి లీలామృతము (బౌండ్) 499-00
- శ్రీ గురు చరిత్ర 199-00
- శ్రీ సంహితాయన గురు ద్విసాహస్రి 149-00
- శ్రీ దత్తావతార మహత్యము 75-00

2. BOOKS ON SRI SAI BABA

షిరిడీ సాయిబాబా పై విరచితమైన శ్రీ షిరిడి గ్రంథములు

- శ్రీ సాయి లీలామృతము 199-00
- శ్రీ సాయి సన్నిధి 199-00
- శ్రీ సాయి ప్రబోధామృతము 119-00
- శ్రీ సాయినాథ పూజ 49-00
- షిరిడీ హారతులు 15-00
- శిరిడీ క్షేత్ర సందర్శనము 49-00
- సాయినాథ స్తవన మంజరి 10-00
- సాయిని పూజించడం ఎందుకు? 10-00
- సాయి సూక్తి ఆచార్యవాణి 20-00
- శ్రీ సాయి నిత్య సత్య వ్రతము 20-00

3. BOOKS ON MAHATMAS

ఇతర మహాత్ముల గ్రంథములు

- శ్రీ అక్కల్ కోట స్వామి 75-00
- శ్రీ తాజుద్దీన్ బాబా 75-00
- శ్రీ అవధూత వెంకయ్య స్వామి 99-00
- అవధూత శ్రీ చీరాల స్వామి 75-00
- శ్రీ పాకలపాటి గురువుగారు 75-00
- శ్రీ ఆనందమయి అమ్మ 75-00
- శ్రీ గురు సిద్ధారూడ స్వామి 99-00
- శ్రీ అవధూత చివటం అమ్మ 99-00
- టిబెట్ యోగి మిలారేపా చరిత్ర 99-00

4. BOOKS ON ANVESHANA & SCIENCE & RELIGION

అన్వేషణాత్మకమైన వైజ్ఞానిక గ్రంథములు

- ఏది నిజం 49-00
- మతం ఎందుకు 49-00
- విజ్ఞాన వీచికలు 99-00

5. BOOKS ON MEDITATION

ధ్యాన సంబంధమైన గ్రంథములు

- ధ్యానయోగ సర్వస్వము 75-00
- బుద్ధ ధ్యాన హృదయము 49-00

6. BOOKS ON SPIRITUALITY & TATVA CHINTANA

ఆధ్యాత్మికత తత్వచింతన పూర్వ గ్రంథములు

- సాయి మాస్టర్ ప్రవచనములు 199-00
- ఆధ్యాత్మిక జాగృతి 199-00

7. BOOKS ON PUJYA ACHARYA E.BHARADWAJA

పూజ్య భరద్వాజ గురుదేవుల పై విరచితమైన గ్రంథములు

- మహాత్ముల ముద్దుబిడ్డడు 149-00
- భగవాన్ శ్రీ భరద్వాజ 299-00
- మహా పురుషుడు 60-00
- సాయి మాస్టర్ స్మృతులు -1 199-00
- సాయి మాస్టర్ స్మృతులు -2 199-00
- ఆచార్య అమృత లేఖావళి 199-00
- మరో నంద దీపం 120-00
- మాస్టారు అమృత వాక్కులు 99-00

8. BOOKS FOR CHILDREN

బాలల కొరకు విరచితమైన గ్రంథములు

- బాలల సాయి లీలామృతము 49-00
- బాలల సాయిసన్నిధి 75-00
- బాలల శ్రీ గురు చరిత్ర 75-00

9. BOOKS IN ENGLISH

ఆంగ్లంలో విరచితమైన గ్రంథములు

- SAI BABA THE MASTER 249-00
- SHRI GURU CHARITRA 149-00
- SUPREME MASTER 149-00
- TAJUDDIN BABA 149-00
- SAI BABA AND HIS TEACHINGS 149-00
- CHILDREN'S SAI BABA THE MASTER 80-00

10. BOOKS IN OTHER LANGUAGES

ఇతర భాషలో విరచితమైన గ్రంథములు

- सद्गुरु श्री साईं बाबा श्रीगुरुच 249-00
- కన్నడ సాయి లీలామృతం 249-00
- కన్నడ ప్రబోధామృతము 149-00
- కన్నడ గురు చరిత్ర 199-00
- కన్నడ సాయి సన్నిధి 249-00
- ఒరియా సాయి సన్నిధి 249-00
- కన్నడ మిలారెపా చరిత్ర 119-00
- కన్నడ స్వామి సమర్థ 119-00
- తమిళ్ సాయి లీలామృతము 249-00
- తమిళ్ షిరిడీ హారతులు 29-00
- తమిళ్ స్తవన మంజరి 20-00
- తమిళ్ శ్రీ గురుచరిత్ర 299-00
- మలయాళ సాయి లీలామృతం 299-00
- మలయాళం గురు చరిత్ర 299-00

11. OTHER BOOKS

ఇతర గ్రంథములు

- సత్సంగము భజన 10-00
- పురుష సూక్త రహస్యము 49-00
- మనము మన సంస్కృతి 75-00

శ్రీ భక్త మహల్సాపతికి శ్రీ శిరిడీ సాయినాథుని చే స్వయంగా ప్రసాదించబడిన వారి నిజపాదుకలు 5-5-23 తేదీన ఒంగోలు పట్టణం అరుదెంచాయి. ఆ రోజున మధ్యాహ్నం గం॥1:00 నుండి గం॥3:00 వరకు శ్రీ సాయి మాస్టర్ నిలయము ఒంగోలులోను, తదుపరి సాయంత్రం గం॥6:00 నుండి గం॥9:00 వరకు శ్రీ అలివేలుమంగమ్మ దివ్యసన్నిధానము గుమ్మళంపాడు వద్ద భక్త మహాశయులందరూ ఆ పాదుకా రూపంలో అరుదెంచిన శ్రీ సాయినాథుని ఆహ్వానించుకుని, దర్శించుకొని, పూజించుకొని తరించారు.

Date of Publication: 21st of each month. Permitted to post: 23rd, 24th, 25th and 26th of each month.
Edited, Printed and Published by Dr. R.S. Sasidhar, Ph.D. trustee of Sri Manga Bharadwaja Trust,
Ongole - 523002. Postal Registration Number : Prakasam/16/2021-2023, Regd.No. 37926/83.

పూజ్యశ్రీ అలివేలు మంగమ్మ తల్లి ద్వితీయ ఆరాధన మహోత్సవము తిథి ప్రకారము (వైశాఖ బహుళ నవమి)
13-5-2023 శనివారం శ్రీ అలివేలు మంగమ్మ దివ్య సన్నిధానము, గుమ్మళంపాడు లో జరిగింది.
భక్త జనులందరూ ఈ పవిత్ర కార్యక్రమంలో శ్రద్ధా భక్తులతో పాల్గొన్నారు